తిరుపతి - చిత్తూరు
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త




## స్పందన అర్జీలను నిర్ణీత కాల వ్యవధిలోపు పరిష్కరించాలి

**జిల్లా కలెక్టర్ వెంకటరమణ రెడ్డి**



తిరుపతి కార్పొరేషన్, సెప్టెంబర్ 4, ప్రభాతవార్త
స్పందన కార్యక్రమంలో వచ్చిన అర్జీలను నిర్ణీత కాల వ్యవధిలోపు పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ వెంకటరమణ రెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం ఉదయం కలెక్టరేట్‌లో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ డికె బాలాజీతో కలిసి స్పందన (గ్రీవెన్స్) అర్జీలను స్వీకరించారు. డిఆర్ఓ కోదండ రామిరెడ్డి, ఎస్‌డిసిలు శ్రీనివాసులు, భాస్కర్ నాయుడు జిల్లాలో వివిధ ప్రాంతాల నుండి వచ్చిన అర్జీదారులు నుండి వినతులను స్వీకరించారు. మొత్తం 143 వినతులు రావడంజరిగిందని, సకాలంలో పరిష్కరించాల్సిందిగా జిల్లా అధికారులను కలెక్టర్ ఆదేశించారు.

## స్పందనకు 319 అర్జీలు



కాణిపాకం, సెప్టెంబర్ 4 ప్రభాతవార్త:
ప్రజా సమస్యలు పరిష్కరించ దానికి చిత్తూరు కలెక్టరేట్‌లో ప్రతి సోమవారం కలెక్టర్ ఆధ్వర్యంలో నిర్వహించే స్పందన కార్యక్రమంకు ఈ వారం జిల్లా నలుమూలల ప్రజల నుండి సమస్యలపై 319 అర్జీలు అందాయి. జిల్లా ఇన్‌ఛార్జ్ కలెక్టర్ పి.శ్రీనివాసులు ప్రజల నుండి సమస్యలపై వచ్చిన అర్జీలను స్వీకరించి వాటిని పరిశీలించి సత్వరం పరిష్కరించడానికి చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి రాజశేఖర్, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## బ్రహ్మోత్సవ అలంకరణలు షురూ



తిరుమలలో మరో 14రోజుల్లో ప్రారంభంకానున్న వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలకు కొండ ముస్తాబవుతోంది. ఆలయం,పరిసరాలు విద్యుద్దీపాలతో అలంకరణ పనులు జోరుగా సాగుతున్నాయి.
ప్రభాతవార్త-తిరుమల

## ఆగస్టు 4 అల్లర్లకేసులో చల్లా రామచంద్రారెడ్డి లొంగుబాటు

పుంగనూరు,సెప్టెంబరు 4 ప్రభాతవార్త :
గతనెల 4న పుంగనూరులో ప్రతిపక్షనేత చంద్రబాబు నాయుడు పర్యటన సందర్భంగా జరిగిన అల్లర్లకేసులలో పోలీసులు ఏవన్‌గా నమోదుచేసిన తెలుగుదేశంపార్టీ పుంగనూరు నియోజకవర్గ కన్వీనర్ చల్లారామచంద్రారెడ్డి సోమవారం స్థానిక సర్కిల్ పోలీస్‌స్టేషన్‌లో లొంగిపోయారు. వివరాలిలా ఉన్నాయి. గతనెల 4న పుంగనూరు బైపాస్ మీదుగా చంద్రబాబునాయుడు పలమనేరు ప్రాంతాలు చేరుకోవాల్సి ఉంది. ఈక్రమంలో ఆయన పుంగనూరు పరిసరాల్లోకి రాగానే పోలీసులపై రాళ్ళదాడులు ప్రారంభమయ్యాయి. దాడులలో 47 మంది పోలీసులు గాయపడగా,రెండు పోలీసు వాహనాలు దగ్ధం చేశారు. ఒకపోలీసు ఒక కన్ను కోల్పోయారు. ఈవిషయాన్ని సీరియస్‌గా తీసుకున్న పోలీసుశాఖ వీడియోల ద్వారా దాడులకు పాల్పడని వారిని గుర్తించింది. ఇప్పటి వరకు 74 మందిని అరెస్టుచేశారు. అయితే, ఈఅల్లర్లకు ప్రధాన సూత్రధారిగా పోలీసులు చెబుతున్న పార్టీ కన్వీనర్ చల్లారామచంద్రారెడ్డి నెలరోజులుగా అదృశ్యంలో ఉన్నారు. ఈక్రమంలో ఆయనతోపాటూ మరికొందరు నిందితులు కూడా లొంగిపోయారు. ఈసందర్భంగా పుంగనూరు పోలీసుస్టేషన్ వద్ద ఉదయం నుంచి ఉద్రిక్తత నెలకొంది. సరిగ్గా మధ్యాహ్నం 12 గంటలకు చల్లారామచంద్రారెడ్డి పలమనేరు డిఎస్పీ సుధాకర్‌రెడ్డి వద్ద లొంగిపోతున్నట్లు ప్రకటించారు. ఈసందర్భంగా చల్లా రామచంద్రారెడ్డి వెంట రాష్ట్ర మాజీ మంత్రి,టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యుడు సోమిరెడ్డిచంద్రమోహన్‌రెడ్డి,మాజీ మంత్రులు పల్లెరఘునాథరెడ్డి,తిరుపతి మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ,మాజీ ఎమ్మెల్యే దొరబాబు,పార్టీనాయకులు శ్రీనివాసులురెడ్డి, నర్సింహయాదవ్,మునికృష్ణలు మద్దతుగా వచ్చారు. డిఎస్పీసుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ నిందితులను కట్టుదిట్టమైన జాగ్రత్తలు,భద్రతల మధ్యన కడప సెంట్రల్‌జైలుకు తరలిస్తున్నట్లు తెలిపారు.కాగా అల్లర్లకు ముందే పక్కాగా వ్యూహం వేశారని, ఈసంఘటనలకు సంబంధించి ప్రధాన సూత్రధారిగా చెబుతున్న చల్లారామచంద్రారెడ్డిపై జిల్లా పోలీసులు ఏడు కేసులలో ఆయనను ఏ1గా పేర్కొన్నారు. అన్నికేసులకు సంబంధించి చల్లా రామచంద్రారెడ్డి హైకోర్టును ఆశ్రయించగా,నాలుగుకేసులకు బెయిల్ లభించింది. మూడింటిని కోర్టు తిరస్కరించింది. దీంతో చల్లా రామచంద్రారెడ్డి సోమవారం మధ్యాహ్నం మూడు కేసులకు సంబంధించి ఏ1గా ఉన్నందున పోలీసులకు లొంగిపోయారు.



పుంగనూరు అల్లర్ల సందర్భంగా దగ్ధమైన పోలీసు వాహనం



పుంగనూరు పోలీస్ స్టేషన్‌లో లొంగిపోవడానికి వచ్చిన తెలుగుదేశం నియోజకవర్గ కన్వీనర్ చల్లా రామచంద్రారెడ్డితో దేశం నాయకులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి,తదితరులు

### సామాన్యులకు అందుబాటులో

## అర అడుగు,అడుగు వేంకటేశ్వరస్వామివారి ప్రతిమలు

**-ఎస్వీ శిల్పకళాశాల సదస్సులో ఛైర్మన్ భూమన**




తిరుమల,సెప్టెంబర్ 4ప్రభాతవార్తప్రతినిధి:
ప్రపంచంలోని ప్రతి దేశ చరిత్రకు శిల్పకళ ఆధారభూతమని టిటిడి ఛైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి తెలిపారు. ఎస్వీశిల్పకళాశాల విద్యార్థులతో అర అడుగు,ఒక అడుగు వేంకటేశ్వరస్వామివారి ప్రతిమలు తయారుచేయించాలని గతంలో భావించానని, స్వామివారు తనకు మళ్లీ అవకాశం ఇచ్చారని తెలిపారు. ఇలాంటి విగ్రహాలు ప్రతి ఇంట్లో ఉండటం వల్ల స్వామి తమతోనే ఉన్నారన్న భావన భక్తులకు కలుగుతుందని అన్నారు. అలిపిరి వద్ద ఉన్న ఎస్వీ సంప్రదాయ శిల్పశిక్షణ సంస్థలో సంప్రదాయ ఆలయ శిల్పకళలు -అనుబంధ అంశాలపై మూడురోజుల సదస్సు సోమవారం ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా భూమన కరుణాకర్‌రెడ్డి, టిటిడి జెఈఓ సదాభార్గవి హాజరయ్యారు. పి.సాయిదేవిక నిరుపయోగ వస్తువులతో తయారుచేసిన వివిధ కళాకృతుల స్టాల్‌ను సందర్శకులు ఆసక్తిగా తిలకించారు. గాజుసీసాలు, మట్టికుండలు,జ్యూట్‌తో తయారుచేసిన గృహాలంకరణకు ఉపయోగపడే అనేక కళాకృతులు ఈ స్టాల్‌లో ఉన్నాయి.

### చిన్నారి లక్షిత కుటుంబానికి

## రూ.10లక్షలు ఆర్థికసాయం అందజేత



తిరుమల,సెప్టెంబర్ 4ప్రభాతవార్తప్రతినిధి:
ఏడుకొండలవేంకటేశ్వరస్వామి దర్శనానికి అలిపిరి కాలినడకమార్గంలో వస్తూ గతనెల 11న చిరుతపులిదాడిలో ప్రాణాలు కోల్పోయిన ఆరేళ్ళ లక్షిత కుటుంబానికి 10లక్షలు రూపాయలు ఆర్థిక సాయం అందింది. చిన్నారి మృతితో తీవ్ర విషాదంలోకి వెళ్ళిన ఆ కుటుంబం ఇప్పటికీ కోలుకోలేదు. నెల్లూరు జిల్లా కోవూరు మండలం పోతిరెడ్డిపాళెంకు చెందిన వెంకటదినేశ్, శశికళ కుమార్తె ఆరేళ్ళ లక్షిత గతనెల 11న కాలినడక తిరుమలకు వస్తుండటం, లక్ష్మీనరసింహస్వామి ఆలయం సమీపంలో బాలికపై చిరుతదాడిచేసి చంపి తినిన విషాద ఘటన చోటుచేసుకుంది. ఈ ఘటనతో స్పందించిన టిటిడి ఛైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి బాలిక కుటుంబానికి టిటిడి తరపున 5లక్షలు, అటవీశాఖ నుంచి 5లక్షలు రూపాయలు మొత్తం 10లక్షలరూపాయలు నష్టపరిహారం అందిస్తామని ప్రకటించిన మేరకు సోమవారం ఈ సాయాన్ని ఆ కుటుంబానికి కోవూరు ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి సమక్షంలో టిటిడి డిప్యూటీ సిఎఫ్ శ్రీనివాసులు, అటవీఅధికారి సతీష్ అందజేశారు.

### 16న జిల్లాలలోని

## డిఈఓలకు ఎఫ్ఎల్సి సూపర్వైజర్లకు వర్క్ షాప్

**రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి**



వీడియో కాన్ఫిరెన్స్‌లో పాల్గొన్న జిల్లా కలెక్టర్, అధికారులు

తిరుపతి కార్పొరేషన్, సెప్టెంబర్ 4, ప్రభాతవార్త
అన్నీ జిల్లాల డిఈఓలకు ఎఫ్ఎల్సి సూపర్వైజర్లకు ఈ నెల 16వ తేది విజయవాడలో వర్క్ షాప్ నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా తెలిపారు. సోమవారం రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా అన్ని జిల్లాల కలెక్టర్లతో, ఈ ఆర్ఓలతో, ఏఈఆర్ఓలతో వర్చువల్ విధానంలో అమరావతి నుండి ప్రత్యేక ఓటర్ల జాబితా సరవణ 2024 పై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి మాట్లాడుతూ ఈ నెల 25వ తేదిలోపు ఓటర్ జాబితా ఫ్రీజింగ్ అవుతుందని, రీ వెరిఫికేషన్ ప్రక్రియ పూర్తి చేయాలని, పెండింగ్ ఫామ్స్ పూర్తి స్థాయిలో పరిష్కరించాల్సి ఉంటుందని, రేషనలైజేషన్ పోలింగ్ స్టేషన్స్, అనామలీలను సరి చేయడం తదితర అంశాలపై సమీక్షించారు. అనంతరం కలెక్టర్ వెంకటరమణా రెడ్డి మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ నిబంధనలను నిర్దేశించిన గడువులోపు వారికి కేటాయించిన విధులను పూర్తి బాధ్యతగా ప్రణాళిక బద్ధంగా చేపట్టాలని ఎటువంటి అలసత్వం ఉండరాదని జిల్లా కలెక్టర్ కె. వెంకటరమణా రెడ్డి ఎఈఆర్వోలను, మున్సిపల్ కమిషనర్లను ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో నగరపాలక కమిషనర్ హరిత, డిఆర్ఓ కోదండ రామిరెడ్డి, ఈఆర్ఓలు కిరణ్ కుమార్, రామారావు, శ్రీనివాసులు, చంద్రముని, కనకనరసారెడ్డి, నియోజకవర్గ ప్రత్యేక అధికారులు చెన్నయ్య, రాధమ్మ, జ్యోతి, ప్రసాద రావు, లక్ష్మి, ఈఆర్ఓలు, ఎన్నికల తహశీల్దార్ సురేష్ పాల్గొన్నారు.

### ధార్మిక మండలి వెబ్‌సైట్‌లో

## తీర్మానాలు ఎందుకు పొందుపరచరు?

**బిజెపి రాష్ట్ర అధికార ప్రతినిధి జి.భానుప్రకాష్‌రెడ్డి సూటి ప్రశ్న**



తిరుపతి ప్రెస్‌క్లబ్,సెప్టెంబర్ 4 ప్రభాతవార్త:
ప్రపంచ ఆధ్యాత్మిక క్షేత్రం కోట్లాది మంది హిందువులకు ఆరాధ్యదైవం ఆ తిరుమల శ్రీవారు.అలాంటి టిటిడి ధార్మిక మండలిలో సభ్యులు తీసుకున్న నిర్ణయాలను వెబ్‌సైట్‌లో ఎందుకు పొందుపరచరని బిజెపి రాష్ట్ర అధికార ప్రతినిధి జి.భానుప్రకాష్‌రెడ్డి టిటిడి ఈఓ,చైర్మన్‌లను ప్రశ్నించారు.ఈ మేరకు సోమవారం స్థానిక టిటిడి పరిపాలనా భవనం ముందు బిజెపి నాయకులతో కలిసి నిరసన కార్యక్రమం చేపట్టారు. ఆయన మాట్లాడుతూ గతంలో పాలకమండలి తీసుకునే ప్రతి నిర్ణయాన్ని టిటిడి అధికారిక వెబ్‌సైట్‌లో పొందుపరిచేవారు.మరి ఇప్పుడు భక్తులకు తెలియకుండా దాచడం వెనుక ఉన్న చిదంబర రహస్యమేంటన్నారు.టిటిడి యాక్ట్ 30,1987కు విరుద్ధంగా నిర్ణయాలు జరగట్లేదు కాబట్టే వెబ్‌సైట్‌లో పొందుపరచడం లేదన్నారు. ఇస్కాన్ రోడ్డులోని టిటిడి స్థలాలు కుల సంఘాలకు కేటాయించాలని గత ధర్మకర్తల మండలి ఆఖరి సమావేశంలో నిర్ణయించారు.చరిత్రలో లేని విధంగా కుల సంఘాలకు దారాదత్తం చేసే ప్రక్రియ మొదలుపెడితే వందలాది కుల సంఘాలు ముందుకొచ్చి టిటిడిని కోరితే వారందరికీ టిటిడి స్థలాలు కేటాయిస్తారా?కావున తక్షణం ఆ ప్రతిపాదనను రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.రాబోవు రోజుల్లో తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్‌లో పని చేస్తున్న 30 డివిజన్ల శానిటరీ ఉద్యోగస్తులకు జీతభత్యాలు టిటిడి నుండి బదలాయించాలనే కుట్ర జరుగుతోందని ఆరోపించారు. కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర అధికార ప్రతినిధి సామంచి శ్రీనివాస్,నేతలు మునిసుబ్రహ్మణ్యం, పొనగంటి భాస్కర్,డా॥శ్రీహరి,బాల భాస్కర్,డా॥నరేష్,టిటిడి తిరుపతి పార్లమెంట్ అధ్యక్షుడు నరసింహయాదవ్,శేఖర్,సుబ్బుయాదవ్,తదితరులు పాల్గొన్నారు.

## కలెక్టరేట్ ఎదుట రైతు ఆత్మహత్యాయత్నం!

చిత్తూరుటౌన్, సెప్టెంబర్ 4 ప్రభాతవార్త:
తన పొలం దారి సమస్య దీర్ఘకాలికంగా పరిష్కారం కాకపోవడంతో పెద్దపంజాణి మండలం బట్టందొడ్డి గ్రామంకు చెందిన రైతు వెంకటస్వామి సోమవారం చిత్తూరు కలెక్టరేట్ ఎదుట ఆత్మహత్యాయత్నంకు సిద్ధమయ్యాడు. తనతో పాటు పురుగుల మందు తీసుకువచ్చి కలెక్టరేట్ ఎదుట సేవించి ఆత్మహత్యాయత్నంకు ప్రయత్నించాడు. ఇది తెలిసిన పోలీసులు రైతు వెంకటస్వామితో చర్చించారు. ప్రైవేటు భూముల వ్యవహారంలో ప్రభుత్వం జోక్యం చేసుకోవడం వుండదని, ఇప్పటికే ఈ భూముల దారి సమస్యపై పలుమార్లు అధికారులు ప్రయత్నించారని రైతుకు తెలిపారు. ఒకవేళ ఇక్కడ ఆత్మహత్యాయత్నం చేసుకోవడానికి ప్రయత్నిస్తే కేసు నమోదు చేస్తామని హెచ్చరించడంతో వెనుదిరిగి వెళ్ళిపోయాడు.

## ఇక రేషన్ డిపోలపై నిఘా

కోట, సెప్టెంబర్ 4 ప్రభాతవార్త
రేషన్ డిపోలు, మొబైల్ డిస్టాండింగ్ (ఎండియు)పై ప్రజాప్రతినిధులు నిఘా పెట్టనున్నారు. విజిలెన్స్ (నిఘా) కమిటీల పేరుతో సరుకుల పంపిణీ పర్యవేక్షణ బాధ్యతలు గ్రామస్థాయిలో సర్పంచులకు అప్పగించనున్నారు. పట్టణ పరిధిలో కార్పొరేటర్లకు అప్పగిస్తారు. జిల్లాలో ఎక్కువమంది కార్పొరేటర్లు, సర్పంచులు, అధికార పార్టీ నేతలు ఉండటంతో యంత్రాంగం చకచకా ప్రభుత్వం ఆదేశాలను అమలు చేసింది. జిల్లాస్థాయిలో విజిలెన్స్ కమిటీ ఛైర్మన్‌గా కలెక్టర్, డివిజన్ స్థాయిలో ఆర్డీఓ, మండల స్థాయిలో తహశీల్దార్ ఛైర్మన్‌గా వ్యవహరిస్తారు. రేషన్ డిపో స్థాయి వచ్చే సరికి పట్టణ ప్రాంతమైతే కార్పొరేటర్లు, గ్రామీణ ప్రాంతమైతే సర్పంచ్ ఛైర్మన్‌గా ఉంటారు. పౌరసరఫరాల శాఖ తరపున చెకింగ్ ఇన్‌స్పెక్టర్, ఇతర అధికారులు సభ్యులుగా ఉంటారు. జిల్లా, రెవెన్యూ డివిజన్, మండల స్థాయి కమిటీల వరకు అధికారులే ఛైర్మన్లుగా ఉన్నప్పటికీ, డిపో స్థాయి వచ్చేసరికి నిఘా కమిటీల బాధ్యతలను ప్రజాప్రతినిధులకు అప్పగించారు. గతంలో ఆహార సలహా కమిటీలు ఉండేవి. వాటి స్థానంలో ఈ కమిటీలు ఏర్పడనున్నాయి.

**అక్రమాలకు అడ్డుకట్ట పడేనా**

ప్రస్తుతం రేషన్ డిపో నుంచి సరుకు ఎండియు ఆపరేటర్లకు వెళుతుంది. ఎండియు ఆపరేటర్లు వీధుల్లో తిరుగుతూ కార్డుదారులకు పంపిణీ చేస్తున్నారు. సరుకుల పంపిణీలో అక్రమాలు జరుగుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఉచిత బియ్యాన్ని అక్రమ మార్గంలో మిల్లర్లకు తరలిస్తున్నారని, ఇలా తరలిన బియ్యాన్ని పాలిష్ చేసి మళ్లీ బహిరంగ మార్కెట్లోకి తెస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. దీన్ని అరికట్టడానికి స్థానిక ప్రజాప్రతినిధులతో నిఘా కమిటీలు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్తున్నారు. రేషన్ సరుకుల పంపిణీ తీరు, డిపోల సమయపాలన, తుకాల్లో మోసాలను అరికట్టడం, సరుకుల అక్రమ రవాణాను అడ్డుకోవడం కమిటీల బాధ్యతలుగా నిర్దేశించారు. అక్రమాలకు అడ్డుకట్ట మాట ఎలా ఉన్నా ప్రజాప్రతినిధుల పెత్తనం మొదలైతే పరిస్థితి మరింత దిగజారే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తమవుతోంది.

### మంచినీటి సమస్య తలెత్తకుండా

## ముందస్తు ఏర్పాట్లు

**జడ్పీ సర్వసభ్య, స్థాయి సంఘ సమావేశాలకు తప్పనిసరిగా జిల్లా అధికారులు**
**- జడ్పీ ఛైర్మన్ గోవిందప్ప శ్రీనివాసులు**




కాణిపాకం, సెప్టెంబర్ 4 ప్రభాతవార్త:
జిల్లాలో మంచినీటి సమస్య తలెత్తకుండా ముందుగానే గుర్తించి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు పక్కాగా చేపట్టాలని జడ్పీ ఛైర్మన్ గోవిందప్ప శ్రీనివాసులు అధికారులను ఆదేశించారు. చిత్తూరు జడ్పీ సమావేశభవనంలో సోమ వారం జడ్పీ ఛైర్మన్ గోవిందప్ప శ్రీనివాసులు అధ్యక్షతన జడ్పీ 1, 2, 4, 7 స్థాయి సంఘ సమావేశాలు జరిగాయి. ఈ సమావేశాలకు జిల్లా ఇన్‌ఛార్జ్ కలెక్టర్ పి.శ్రీనివాసులు, జడ్పీ సిఇఓ ప్రభాకర్‌రెడ్డిలు హాజరయ్యారు. ఈ సమావేశంలో జడ్పీ ఛైర్మన్ మాట్లాడుతూ వ్యవసాయంకు సంబంధించి రైతులకు అవసరమైన విద్యుత్ కనెక్షన్లు, ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. పెద్దపంజాణి మండలంలో ప్రభుత్వ ప్రాధాన్యత భవనాల పనులు జరుగడం లేదని ప్రజాప్రతినిధుల నుండి ఫిర్యాదులు అందాయని, ఎందుకు పనులు జరుగడం లేదనే విషయంను పంచాయతీరాజ్ శాఖ ఎస్ఇ వెళ్ళి పరిశీలించి రావాలని ఛైర్మన్ ఆదేశించారు. అలాగే ప్రభుత్వ ప్రధాన్యాత భవనాలైన గ్రామ, వార్డు సచివాయాలు, వైఎస్ఆర్ రైతు భరోసా కేంద్రాలు, వైఎస్ఆర్ హెల్త్ క్లినిక్‌ల నిర్మాణాలు అక్టోబర్ 30 నాటికి పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఛైర్మన్ ఆదేశించారు. జడ్పీ సర్వసభ్య, స్థాయి సంఘ సమావేశాల్లో గ్రామ స్థాయిలో వున్న సమస్యలను చర్చించడం జరుగుతుందని, ఈ సమావేశాల్లో ప్రజాప్రతినిధులు, అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొనప్పుడే సమస్యలకు పరిష్కారం లభిస్తుందని, అయితే జిల్లా స్థాయి అధికారులు కొంతమంది ఈ సమావేశాలు హాజరు కావడం లేదన్నారు. జిల్లా ఇన్‌ఛార్జ్ కలెక్టర్ పి.శ్రీనివాసులు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న రేషన్ బియ్యంను కుప్పం, పలమనేరు, నగరి డివిజన్లలో ప్రక్క రాష్ట్రాలకు తరలిస్తున్నారని దీనిపై స్థానిక ప్రజాప్రతినిధులు దృష్టి కేంద్రీకరించాలని కోరారు. పౌర సరఫరాలకు సంబంధించి జిల్లా, మండల స్థాయి ఎఫ్‌పి షాపులకు విజిలెన్స్ కమిటీ ఏర్పాటు చేయడం జరుగుతుందని, ఇందులో ప్రజాప్రతినిధులు సభ్యులుగా వుంటారని, ఈ కమిటీలను ఏర్పాటు చేయాలని ఇప్పటికే తహసిల్దార్లను ఆదేశించడం జరిగిందన్నారు. ఆడుదాం ఆంధ్రా కార్యక్రమంకు సంబంధించి వార్డు, గ్రామ సచివాలయాలు, నియోజకవర్గ, జిల్లా స్థాయికి సంబంధించి సర్పంచులు, జడ్పీటిసీలు, ఎంపిపిలతో ఈ నెల 7వ తేదీన నాగయ్య కళాక్షేత్రంలో సమావేశం నిర్వహించడం జరుగుతుందన్నారు. వివిధ శాఖల జిల్లా అధికారులు, జడ్పీటిసీలు, ఎంపిపిలు, ఇతరులు పాల్గొన్నారు.

## రికార్డు స్థాయిలో అభిషేకాలు, పూజలు : సామాన్య భక్తుల తిప్పలు

శ్రీకాళహస్తి,సెప్టెంబర్ 4 ప్రభాతవార్త
శ్రీకాళహస్తీశ్వరాలయంలో సోమవారం రికార్డు స్థాయిలో స్వామి అమ్మవార్ల అభిషేకాలు జ రిగాయి. ఇక రాహుకేతుదోష నివారణ పూజలు కూడా జరిగినట్లు అధికారులు అందించిన సమాచారాన్ని బట్టి తెలుస్తుంది.పూజలు వేలల్లో జరుగగా అభిషేకాలు వందల్లో జరిగాయి. అయితే ఆలయంపై వస్తున్న విమర్శల దృష్ట్యా చైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు చొరవ చూపి ఉదయం నుంచి సాయంత్రం వరకు పర్యవేక్షించారు.స్వామి అమ్మవార్ల అభిషేకాలు 155 జరిగాయి. అలాగే సాయంత్రం నిర్వహించే మహాన్యసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకాలు 46 జరిగినట్లు వివరించారు.గోపూజలు 52,శనీశ్వరస్వామి అభిషేకాలు 12,రాహుకేతుదోష నివారణ పూజలు 3828లు జరిగాయి. అలాగే శీఘ్రదర్శనం,ప్రత్యేక ఎంట్రన్స్ టిక్కెట్లు 1612 ప్రసాదాలు పాతికవేలు అమ్ముడుపోయాయి.



**ముక్కుసూటిగా డెప్యూటీ ఛైర్మెన్:**

శ్రీకాళహస్తీశ్వరాలయానికి వచ్చే భక్తులు టిక్కెట్లు కొనుగోలు చేసి స్వామి అమ్మవార్ల దర్శనాలకు వస్తారు.కానీ దళారీలు ప్యాకేజీలు మాట్లాడుకొని సొమ్ములు వసూలు చేసుకొని తమ పలుకుబడితో విచ్చల విడిగా దర్శనాలు చేయిస్తూ శివయ్య ఆదాయాలకు గండి కొడుతున్నారు. సోమవారం ఆలయంలో రద్దీ విపరీతంగా ఉంది. ఒకవేళ దళారులు పిలుచుకొని వచ్చినా పది మంది వస్తే కనీసం 5 టిక్కెట్లు అయినా కొనుగోలు చేయమని సూచిస్తూ కొనుగోలు చేయిస్తూ శివయ్య ఆదాయాలను పరిరక్షించటంలో తన వంతు కృషి చేస్తున్నారు.ఇక స్వామి గర్భగుడి వద్ద ఛైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు కట్టడి చేసారు.అంతరాలయ దర్శనం విఐపిలకు మాత్రమే అనుమతించారు.సాయంత్రం వరకు బాగానే జరిగింది.కానీ సాయంత్రం మళ్ళీ దళారులు విజృంభించారు.

## 7న కాణిపాకంలో శ్రీకృష్ణాష్టమి గోపూజ

కాణిపాకం, సెప్టెంబర్ 4 ప్రభాతవార్త:

కాణిపాకం శ్రీవరసిద్ది వినాయక స్వామివారి దేవస్థానంలో 7న శ్రీకృష్ణాష్టమి సందర్భంగా గోపూజ కార్యక్రమం నిర వ్వహించనున్నట్లు ఆలయ ఈఓ ఎ.వెంకటేశు తెలిపారు. స్థానిక దేవస్థానం గోశాలలో ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 10 గంటల వరకు గోపూజ కార్యక్రమంను నిర్వహించనున్నట్లు తెలిపారు.

**నేడు మహేష్ స్పెషాలిటీ ఆర్థోక్లినిక్ ఉచిత వైద్యశిబిరం**

చిత్తూరు మహేష్ స్పెషాలిటీ ఆర్థోక్లినిక్ వారిచే కాణిపాకం శ్రీవరసిద్ది వినాయకస్వామివారి దేవస్థానంలో మంగళవారం ఉచిత వైద్యశిబిరాన్ని నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ వెంకటేశు తెలిపారు. స్థానిక ఆస్థాన మండపంలో ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు ఆస్పత్రి వైద్యులచే ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

## ఇన్‌చార్జీ తహాశీల్ధార్‌గా రవి కుమార్ బాధ్యతలు



వెదురుకుప్పం, సెప్టెంబర్ 4 ప్రభాతవార్త :

మండల ఇన్‌చార్జీ తహాశీల్దార్‌గా రవికుమార్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. తహాశీల్దార్‌గా విధులు నిర్వహిస్తున్న లక్ష్మీ నారాయణ సెలవు పెట్టడంతో ఆయన స్థానంలో రవికుమార్ బాధ్యతలు తీసుకున్నారు. ఆయన మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉంటూ రెవెన్యూ సమస్యలు పరిష్కారించడం జరుగుతుందన్నారు. జడ్పీటిసి సభ్యులు చలం పాళ్యం సుకుమార్, వైసీపీ నాయకులు మరకాలకుప్పం రామయ్య, బొజ్జా రెడ్డి,ప్రముఖ జ్యోతిషులు చక్రధర్ సిద్దాంతి తదితరు మర్యాద పూర్వకంగా కలిసి పుష్ప గుచ్చం అందజేసి స్వాగతం పలికారు.

## తవణంపల్లెలో 'స్వచ్ఛతా పక్వాడ్'



తవణంపల్లె, సెప్టెంబర్ 4 ప్రభాతవార్త:

మండల విద్యాశాఖ ఆధ్వర్యంలో మండలంలోని పలు గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో 'స్వచ్చతా పక్వాడ్' కార్యక్రమంను సోమవారం నిర్వహించారు. కేంద్ర విద్యాశాఖ ఆదేశాల మేరకు అన్ని ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలల్లో ఈనె 1 నుండి 15 వరకు స్వచ్ఛతా పక్వాడ్ కార్యమంను అమలు చేస్తున్నారు. ఈమేరకు సోమవారం మండల కేంద్రం తవణంపల్లె ఎంపీపీ స్కూల్, ఎగువ వెంకటాపురం ప్రాథమిక పాఠశాలల్లో ఎంఈఓ-1 హేమలత ఆధ్వర్యంలో స్వచ్చతా పక్వాడ్ కార్యక్రమంను నిర్వహించారు. ఈసందర్బంగా విద్యార్థులకు మరుగుదొడ్ల వినియోగం, మంచినీరు పొదుపుగా వాడటం, నీటి పారిశుద్యంపై అవగాహన కల్పించారు. ఈకార్యక్రమంలో సీఆర్పీ చిట్టిబాబు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

**బైజ్యూస్ ట్యాబుల వినియోగంపై అవగాహన**

ప్రభుత్వం విద్యార్థులకు అందజేసిన బైజ్యూస్ ట్యాబ్‌ల వినియోగంపై పాఠశాల విద్యార్థులకు సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జిల్లా నోడల్ అధికారులు సుధాకర్, మోహన్‌సింగ్‌ల ఆధ్వర్యంలో మండలంలోని ప్రాథమిక, ప్రాథమికోన్న పాఠశాల విద్యార్థులకు ట్యాబ్‌ల వినియోగంపై అవగాహన కల్పించారు. ఈకార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారి-2 త్యాగరాజులు రెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## అర్ధగిరి హుండీల ద్వారా 17.05 లక్షలు ఆదాయం



తవణంపల్లె, సెప్టెంబర్ 4 ప్రభాతవార్త:

ప్రముఖ పుణ్యక్షేత్రమైన అర్ధగిరి శ్రీవీరాంజనేయ స్వామి దేవస్థానంకు హుండీ లెక్కింపు ద్వారా 17.05 లక్షలు రూపాయలు ఆదాయంగా లభించింది. సోమవారం ఆలయ ఛైర్మన్ పి.సురేంద్రారెడ్డి, ఈఓ వెంకట సుబ్బారెడ్డిల ఆధ్వర్యంలో అరగొండ సప్తగిరి గ్రామీణ బ్యాంకు వారిచే హుండీ లెక్కింపు నిర్వహించారు. ఈసందర్బంగా 99 రోజులకు గాను 17,04,949 రూపాయలు ఆదాయంగా వచ్చింది. ఈ హుండీ లెక్కింపు కార్యక్రమంలో దేవాదాయశాఖ అధికారి శ్వేత, శిక్షణా ఈఓ యువరాణి, సప్తగిరి గ్రామీణ బ్యాంకు మేనేజర్ శివమానందరెడ్డి, అర్చకులు, సిబ్బందితో పాటు ఆలయ, బ్యాంకు,సిబ్బంది పాల్గొన్నారు.

## అభివృద్ధి..సంక్షేమం సిఎం జగన్‌కు రెండుకళ్లు

**- ఎమ్మెల్సీ, జిల్లా వైకాపా అధ్యక్షుడు భరత్**



కుప్పం, సెప్టెంబర్ 4 ప్రభాతవార్త

అభివృద్ధి,సంక్షేమం సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డికి రెండు కళ్లు అని ఎమ్మెల్సీ,జిల్లా వైకాపా అధ్యక్షుడు భరత్ పేర్కొన్నారు. సోమవారం కుప్పం మున్సిపల్ ఛైర్మన్ డా॥ సుధీర్ అధ్వర్యంలో 18,20వార్డుల పరిధిలో జరిగిన గడపగడపకు మీ ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈసందర్బంగా ప్రజలకు నాలుగన్నర ఏళ్లలో అందిన సంక్షేమ పథకాల గురించి అడిగి తెలుసుకున్నారు. ప్రతి కుటుంబం ఏదో ఓ పథకంలో లబ్ది పొందిందని పేర్కొన్నారు. సిఎం జగన్ చేస్తున్న మేలును గుర్తించి ప్రజలు వైకాపాను మరోమారు ఆదరించాలన్నారు. కుప్పం ఎమ్మెల్యేగా తనకు అవకాశం కల్పిస్తే ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజాసేవకే అంకితమవుతానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమాల్లో ఎఎంసి ఛైర్మన్ విద్యాసాగర్, ఎపిఐడిసి డైరెక్టర్ నందకుమార్, ఎపిసిఎస్‌సి డైరెక్టర్ శ్రీనివాసమూర్తి, అవినాష్, మణికంఠ, స్థానిక నేతలు, కౌన్సిలర్లు, వార్డు సచివాలయ ఉద్యోగులు, వాలంటీర్లు పాల్గొన్నారు.

## కుప్పం బిల్డింగ్ సొసైటీ అభివృద్ధికి కృషి చేస్తాం - ఛైర్మన్ అబ్బాస్



కుప్పం, సెప్టెంబర్ 4 ప్రభాతవార్త

కుప్పం సహకార బిల్డింగ్ సొసైటీ అభివృద్ధికి కృషి చేస్తామని ఛైర్మన్ ఎస్.బి. అబ్బాస్ పేర్కొన్నారు. సోమవారం బిల్డింగ్ సొసైటీ ఛైర్మన్ అబ్బాస్, సభ్యులు మూర్తి, సునీల్‌లు ఎమ్మెల్సీ భరత్ సమక్షంలో ప్రమాణస్వీకారం చేసి బాధ్యతలు చేపట్టారు. ఎమ్మెల్సీ భరత్ మాట్లాడుతూ 1948లో ప్రారంభమైన బిల్డింగ్ సొసైటీకి ఇరవై ఏళ్ల అనంతరం నూతన పాలకవర్గాన్ని ఏర్పాటుచేశామన్నారు. తనతండ్రి దివంగత చంద్రమౌళికి మద్దతుగా నిలిచి పార్టీ కోసం కష్టపడిన వారికి ఈ నామినేటెడ్ పదవులు దక్కడం పట్ల ఆనందం వ్యక్తం చేశారు. ఛైర్మన్ అబ్బాస్ మాట్లాడుతూ సొసైటీ అభివృద్ధికి ప్రభుత్వం తరపున స్థలం కేటాయించాలని కోరారు. ఈ కార్యక్రమాల్లో మున్సిపల్ ఛైర్మన్ డా॥ సుధీర్, రెస్కోఛైర్మన్ సెంధిల్‌కుమార్, ఎఎంసి ఛైర్మన్ విద్యాసాగర్, మండల కన్వీనర్ హెచ్‌ఎం మురుగేష్, ఎంపిపి అశ్విని, సలహాదారు ఆర్.శ్రీనివాసులు, నేతలు పెద్దన్న, ఇంతియాజ్, వెంకటరామయ్య, దౌలత్,నాసిర్, జయరాం, ఆంజనేయగుడి ఛైర్మన్ కుమరేష్‌లు పాల్గొన్నారు.

## కారుతో సహా కర్ణాటక మద్యం స్వాధీనం

కుప్పం, సెప్టెంబర్ 4 ప్రభాతవార్త

కర్ణాటకనుంచి అక్రమంగా కారులో తరలిస్తున్న మద్యాన్ని స్వాధీనం చేసుకుని ఓ వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు అర్బన్ ఎస్సై శివ కుమార్ తెలిపారు. మున్సిపాలిటీ పరిధి బైరుగానిపల్లికి చెందిన బాలకృష్ణ అనే వ్యక్తి కర్ణాటకలోని కెంపాపురం నుంచి కారులో (కెఎ40ఎం2214) 58,785రూ.ల విలువ చేసే 21 బాక్సుల కర్ణాటక మద్యం తరలిస్తూ పట్టుబడ్డాడన్నారు. కారు,మద్యాన్ని సీజ్ చేసి నిందితుడ్ని రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు.

## నిత్యావసరాలు ప్రజలకు సక్రమంగా అందేలా చర్యలు



కుప్పం, సెప్టెంబర్ 4 ప్రభాతవార్త

రాష్ట్ర ప్రభుత్వం చౌక దుకాణాల ద్వారా పేదలకు అందించే నిత్యావసర సరుకులు సక్రమంగా అందేలా చర్యలు తీసుకుంటున్నట్లు ఎపిసిఎస్‌సి డైరెక్టర్ శ్రీనివాసమూర్తి పేర్కొన్నారు. సోమవారం ఎమ్మెల్సీ భరత్, మున్సిపల్ ఛైర్మన్ డా॥ సుధీర్‌తో కలసి పట్టణంలో ఎండియు వాహనాల ద్వారా సరుకుల పంపిణీని ఆయన పరిశీలించారు. ప్రజలకు బియ్యం, కందిపప్పు, చక్కెర తదితర సరుకులు అందిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రజలకు సకాలంలో నిత్యావసరాలు అందేలా చర్యలు తీసుకుంటామన్నారు.

## దళిత విద్యార్థిని ఉన్నత చదువు కోసం ఆర్థిక సహాయం

గుడిపాల, సెప్టెంబర్ 4 ప్రభాతవార్త:

గుడిపాల మండలం వసంతాపురం సర్పంచ్ ఎన్ఎస్ రజనీకాంత్ ఓ దళిత విద్యార్థిని ఉన్నత చదువుల కోసం 50 వేల రూపాయల ఆర్థిక సహాయంను అందజేశారు. ఐరాల మండలం కాణిపాకంపట్నం దళితవాడకు చెందిన ఆటో డ్రైవర్ ఇలంగో తన కుమార్తె పవిత్రను కష్టపడి ఉన్నత చదువులు చదివిస్తున్నాడు. ఇలంగో కుమార్తె ఉన్నత చదువు కోసం పడుతున్న కష్టంను గుర్తించిన సర్పంచ్ రజనీకాంత్ తన వంతు సహాయంగా ఆమె చదువు కోసం 50 వేల రూపాయలు ఆర్థిక సహాయం అందజేశారు. తన కుమార్తె ఉన్నత చదువు కోసం ఆర్థిక సహాయం చేసిన సర్పంచ్ రజనీకాంత్‌ను ఇలంగో కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల వైకాపా యువత అధ్యక్షుడు శింబు తదితరులు పాల్గొన్నారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## మహాశక్తి పథకాలతో మహిళలకు చంద్రబాబు అండ

**- తెలుగు మహిళ అధ్యక్షురాలు అనసూయ**



కుప్పం, సెప్టెంబర్ 4 ప్రభాతవార్త

తెదేపా అధినేత చంద్రబాబు నాయుడు మహాశక్తి పథకాలతో మహిళలకు అండగా నిలుస్తారని నియోజకవర్గ తెలుగు మహిళ అధ్యక్షురాలు అనసూయ పేర్కొన్నారు. సోమవారం గుడుపల్లె శ్రీ రాళ్ల గంగమ్మ ఆలయంలో ప్రత్యేక పూజల అనంతరం మహాశక్తి పథకాల ప్రచారం ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ 18-59ఏళ్ల మహిళలకు ప్రతినెలా రూ 1500లు, తల్లికివందనం పేరిట ప్రతి చదివే పిల్లవాడికి 15వేలు, ఏటా రెండు ఉచిత గ్యాస్ సిలిండర్లు, ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించడం జరుగుతుందన్నారు. మహిళలు నేడు అన్ని రంగాల్లో రాణిస్తున్నారంటే అది చంద్రబాబు చొరవేనన్నారు. కార్యక్రమాల్లో పార్టీ కన్వీనర్ ఆర్. చంద్రశేఖర్, కార్యకర్తల సంక్షేమ విభాగం కన్వీనర్ త్రిలోక్, మండల పార్టీ అధ్యక్షుడు బాబు నాయుడు, మాజీ జడ్పీటిసి బేటప్పనాయుడు, తెలుగు మహిళ అధ్యక్షురాలు పద్మ, స్థానిక నేతలు పాల్గొన్నారు.

## ఏనుగు మృతుల బాధిత కుటుంబాలకు ఆర్థిక సహాయం



చిత్తూరుటౌన్, ఆగస్టు 4 ప్రభాతవార్త:

గుడిపాల మండలంలో ఇటీవల ఏనుగు దాడిలో మృతి చెందిన వెంకటేష్, సెల్వి ల కుటుంబ సభ్యులకు జనసేన పార్టీ 50 వేల రూపాయల ఆర్థిక సహాయంను అందజేసింది. ఈ మేరకు చిత్తూరు నియోజకవర్గ జనసేన ఇన్‌ఛార్జీ దయారం బాధిత కుటుంబాలను కలిసి చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో దేవినేని జశ్వంత్, భానుప్రసాద్, హేమాద్రి, లోచన్, హరీష్ తదితరులు పాల్గొన్నారు.

## డిప్యూటీ కలెక్టర్ ప్రత్యూషకు ఘన సత్కారం



కుప్పంరూరల్, సెప్టెంబర్ 4 ప్రభాతవార్త

ఇటీవల డిప్యూటీ కలెక్టర్‌గా ఎంపికైన సాయి ప్రత్యూషను సోమవారం కుప్పం బిసిఎన్ గ్రూప్స్ ఛైర్మన్ బిసి నాగరాజ్, ఛైర్‌పర్సన్ శాంత నాగరాజ్, సిఇఓ సాగర్‌రాజ్‌లు ఘనంగా సత్కరించారు. ఛైర్‌పర్సన్ శాంత నాగరాజ్ మాట్లాడుతూ తమ కుప్పం పబ్లిక్ స్కూల్ పూర్వ విద్యార్థి అయిన ప్రత్యూష డిప్యూటీ కలెక్టర్‌గా ఎంపికకావడం గర్వకారణమన్నారు. విద్యార్థులు ఇదే స్పూర్తితో ఉన్నత స్థాయికి ఎదగాలని సూచించారు. కార్యక్రమంలో దమయంతి, ప్రియ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు నాణ్యమైన భోజనం



పాలసముద్రం, సెప్టెంబర్ 4 ప్రభాతవార్త:

పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాల్లోని విద్యార్థులకు నాణ్యమైన భోజనం పెట్టాలని ఎంపిడిఓ ప్రేమ్‌రాజ్‌కుమార్ ఆదేశించారు. ఎంపిడిఓ ప్రేమ్‌రాజ్‌కుమార్ సోమవారం మండలంలోని పాలసముద్రం మండల పరిషత్ పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాల్లో మధ్యాహ్న భోజనంను పరిశీలించి విద్యార్థులకు కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. ఎంపిడిఓ మాట్లాడుతూ అంగన్‌వాడీ, ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన, రుచికరమైన భోజనం పెట్టాలని, విద్యార్థుల హాజరు శాతం పెంచడానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం ఎంపిడిఓ పాలసముద్రం లేఅవుట్‌లో జరుగుతున్న జగనన్న ఇళ్ళ నిర్మాణాలను పరిశీలించి త్వరితంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ ఎఇ దాము, ఇంజనీరింగ్ అసిస్టెంట్ అక్షయ్, వెల్ఫేర్ అసిస్టెంట్ చెంచయ్య, గ్రామ వాలంటీర్లు, గ్రామస్తులు, లబ్దిదారులు పాల్గొన్నారు.

# గూడూరు డివిజన్

గూడూరు, సూళ్లూరుపేట, వెంకటగిరి నియోజకవర్గాలు

## ప్రతి ఇంటి నుంచి మట్టిని సేకరించాలి



కోట,సెప్టెంబర్ 4 ప్రభాతవార్త

భారత దేశ ప్రధాని నరేంద్రమోదీపిలుపు మేరకు ప్రతి గ్రామం నుంచి మట్టిని సేకరించి అమల వీరుల సూప్థం కోరకు ఢీల్లికి పంపిండం జరుగుతందని కోట మండల భాజపా అధ్యక్షులు డాక్టర్, సారంగం రమేస్‌బాబు చెప్పారు. సోమవారం సుబాష్ చంద్రబోస్ విగ్రహానికి పూలమాల వేశారు. అనంతరం ఆయన విగ్రహం వద్ద నుంచి కొంత మట్టిని సేకరిచారు. మండలంలోని ప్రతి ఇంటి నుంచి చిటికేడు మట్టిని సేకరించి దేశ రాజధాని ఢీల్లికి పంపుతున్నట్లు ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో కోట మండల ఇన్‌చార్జీ బైరప్ప, జిల్లా కార్యవర్గ సభ్యులు,అంబరీష్, కార్యదర్శి వెంకయ్య, పరశురామ్, ,తదితరులు పాల్గొన్నారు.

## స్పందనలో సమస్యలపై కౌన్సిలర్ శంకరయ్యకు వినతిపత్రాలు



వెంకటగిరి, సెప్టెంబర్ 4, ప్రభాతవార్త:

సుదర్శన్‌నగర్‌లో ఉన్న 8వ సచివాలయంలో స్పందన కార్యక్రమం నిర్వహించినట్లు కౌన్సిలర్ ఆరి శంకరయ్య తెలిపారు. 14, 15 వార్డులోని ప్రజలకు ఎలాంటి సమస్యలు ఉన్నా సోమవారం అర్జీల రూపంలో అందజేయాలన్నారు. నేదురుమల్లి ఫౌండేషన్ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 8న మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి చెప్పారన్నారు. ఈ అవకాశాన్ని నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలన్నిరు. వివరాలకు 9010902009, 9059069067 నెంబర్లను సంప్రదించాలన్నారు. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి పేరు మీద రాష్ట్రంలోని 680 మండలాల్లో రాజన్న క్యాంటీన్లు ప్రారంభిస్తే పేద ప్రజలకు ఒక పూట మధ్యాహ్నం భోజనం పెట్టడం పట్ల పేదల ఆకలి తీరుతుందని సీఎం జగన్మోహన్‌రెడ్డిని పేద ప్రజలు కోరుకుంటున్నట్లు తెలిపారు.

## ఉపాధ్యాయులకు క్రీడ పోటీలు



కోట,సెప్టెంబర్ 4 ప్రభాతవార్త

కోటలోని మహాత్మాజ్యోతిబాపూలే గురుకులంలో సోమవారం మండలంలోని ఉపాధ్యాయులకు క్రీడపోటీలను నిర్వహించారు. ఈ క్రీడ పోటీలను ఎంఈఓ మస్తానయ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా మస్తానయ్య మాట్లాడుతూ గరుపూజ దినోత్సం పురస్కరించుకొని ఈక్రీడ పోటీలను నిర్వహించడం జరుగుతందన్నారు. నిత్యం ఉపాధ్యాయులు విధి నిర్వహణలో ఒత్తిళ్లకు గురువుతుంటారని పేర్కొన్నారు. వారిలో కొంత ఉత్సహం నింపే క్రమంలో ఉపాధ్యాయ దినోత్సవం సందర్బంగా ఈ క్రీడ పోటీలను నిర్వహించడం జరుగుతందన్నారు. మ్యూజికల్,చైర్, వాకింగ్, షాట్‌పుట్,తదితరపోటీలు నిర్వహించారు.

## జిల్లా, మండల స్థాయి ఉత్తమ ఉపాధ్యాయులు వీరే

తడ, సెప్టెంబర్ 4, ప్రభాతవార్త

జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు హెచ్‌డి ఫణి వేని, తడ కండ్రిగ ప్రాథమిక ఉన్నత పాఠశాల ఎస్‌జిటి ఎస్.స్వరాజ్య లక్ష్మిలు జిల్లా స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైనట్లు మండల విద్యాశాఖ అధికారులు తెలిపారు. మండల ఉత్తమ ఉపాధ్యాయులుగా మలిచెంచురామయ్య (కాసింగాడు కుప్పం) నల్లబోతుల రాజేశ్వరి (అండగుండాల) వెంకటశారద (రామాపురం) ఎంపిక అయినట్లు తెలిపారు.

## తరగతులే కాదు.. జీవిత పాఠాలు నేర్పిస్తారు

**డైరెక్టర్ డా.వి.విజయకుమార్ రెడ్డి**




కోట,సెప్టెంబర్ ,4 ప్రభాతవార్త

ఇంజినీరింగ్ విద్యార్దులకు సంబందిత కోర్సులో సాంకేతిక విద్య కాకుండా జీవితంపై సమగ్ర దృక్పధాన్ని పెంచి పని చేయాలని నేర్పడం జరుగుతుందని ఎన్‌బీకేఆర్ ఐఎస్‌టి డైరెక్టర్, డాక్టర్.వి.విజయకుమార్ రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని విద్యానగర్ లోని ఎన్‌బికేఆర్ ఐఎస్‌టిలో మొదటి సంవత్సరం విద్యార్దులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్బంగా డైరెక్టర్ విజయకుమార్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్దులు తాను ఎంచుకున్న విభాగంలో అద్బుతమైన జ్ఞానం,నైపుణ్యాలను పెంచుకొని, సమాజం,సంబంధాల గురించి వివరించడం జరుగుతందన్నారు ఇంజినీరుగా, పౌరుడిగా బాధ్యతలు సక్రమంగా నెరవేర్చేలా తర్పీదు ఇవ్వడం జరుగుతందన్నారు.కళాశాల పద్దతులు, విలువలు, సంస్కృతిని పెంపొందిటం, ఇతర విద్యార్దులు, అధ్యాపకులతో సంబంధాలు ఏర్పరచుకొవడం, భవిష్యత్ కోసం స్వీయ అనేషణ, విధానాన్ని అవలంబించేలా ప్రోత్సహించడం జరుగుతందన్నారు. శారీరక, కార్యచరణలు, సృజనాత్మక కళలు, సాంస్కృతి కార్యక్రమాలు, మానవ విలువలపై అవగాహన ,ప్రముఖ వ్యక్తుల ఉపన్యాసాలు,వంటి కార్యక్రమాలు ఉంటాయన్నారు.విద్యార్దులు, విలువైన సమయాన్ని వృధ్దా చేయకుండా కాపాడుకోగలితే కోర్సు పూర్తి అయ్యేలోపే మంచి బహాళాజాతి కంపెనీల్లో ఉద్యోగులు వస్తాయన్నారు. విద్యార్దులు క్రమశిక్షణ, భవిష్యత్ కార్యాచరణ ఏంతో అవపరం అన్నారు. తమ కళాశాలను కరస్పాడెంట్ నేదురుమల్లి రామ్ కుమార్ రెడ్డి ప్రగతి పధంలో తీసుకేళ్లాతున్నారని పేర్కొన్నారు. తమ కళాశాలో డాక్టరేట్ల్ పొందిన సినియర్ అధ్యాపకులు ఉన్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో అన్ని విభాగాధిపతులు పాల్గొన్నారు.నూతన విద్యార్దులతో కళాశాల పండగ వాతవరణం కనబడింది. విద్యార్దులు తల్లిదండ్రులకు కళాశాల యాజమన్యాం అతిధ్యం ఇచ్చింది.

## ఊనుగుంటపాళెంలో వినాయుడి విగ్రహ ప్రతిష్ట



కోట,సెప్టెంబర్ 4 ప్రభాతవార్త

కోట మండలం ఊనుగంటపాళెంలో సోమవారం గణేష్ విగ్రహానికి గ్రామస్తులు పూజ కార్యక్రమం నిర్వహించారు.అలంకారోత్సవాలు, అభిషేకాలు, స్వామి వారికి గ్రామోత్సవం జరుగుతందని సర్పంచ్ చెంగయ్య తెలిపారు, ఈవిగ్రహ ప్రతిష్ట కార్యక్రమం అంగరంగ వైభవంగా జరిగింది. బాణ సంచా వేడుకలతో తప్పెట్లుతో గ్రామెత్సవం జరిగింది. ఈకార్యక్రమంలో సర్పంచ్ చెముడుగుంట చెంగయ్య, మాజీ సర్పంచ్ తన్నమాల కోటారెడ్డి, విద్యాకమిటి ఛైర్మెన్, నాగుర్ యూదవ్,చల్లా వెంకటశ్వేర్లు,సుదీర్ రెడ్డి,తదితరులు పాల్గొన్నారు.

## ఉత్తమ ప్రిన్సిపల్‌గా ఎ.వి.ఎల్

కోట,సెప్టెంబర్ 4 ప్రభాతవార్త

వినూత్న బోధన, చిత్తశుద్దిగా పని చేయడం, సమాజ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న గురువులను ప్రభుత్వం గుర్తించింది.పలువురు అధ్యాపకులు,ఆచార్యులను ఉత్తమ ఉపాధ్యా పురస్కారాలకు ఎంపిక చేసింది.ఈనెల 5న ఉపాధ్యా దినోత్సవం రోజున పురస్కారాలు ప్రధానం చేయనున్నారు. తిరుపతి జిల్లా కోటలోని అంబేద్కర్ గురుకుల కళాశాల ప్రిన్సిపల్‌గా ఎ.వి.ఎల్ (వెంకటేశ్వర్లు ) ఎంపికయ్యారు. తెలుగు విభాగంలో ఆచార్యులుగా విద్యార్దులను ఉత్తమ పైరులుగా తీర్చదిద్దడం, పోటీ పరీక్షల్లో మెలకువలు తెలయజేయడం ఆయన శ్రద్ద కనబరిచారు.బోధన రంగంలో చేస్తున్న కృషి కి ఇటు పదివ తరగతిలోను ఇంటర్‌లో పలితాల్లో ప్రధమ స్ధాయిలో తీసుకోనిరావడంలో ఎవిఎల్ ఎల్లప్పుడు ముందు వరసలో ఉంటారు. విధి నిర్వహణలో ఆయన ఆయనకే సాటి అని చెప్పవచ్చును. కళాశాలలో క్రమశిక్షణ కు ఆయన మారుపేరుగా చెప్ప వచ్చును.

## పులికాట్ జాలర్ల సమస్యలు పరిష్కరిస్తా

**సూళ్లూరుపేట ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య**



తడ, సెప్టెంబర్ 4, ప్రభాతవార్త

తడ మండలంలోని పులికాట్ జాలర్ల సమస్యలు పూర్తిగా పరిష్కరిస్తామని సూళ్లూరుపేట శాసన సభ్యులు కిలివేటి సంజీవయ్య పేర్కొన్నారు. సోమవారం ఆయన తడ మండలం ఇరకందీవిలోని తిరువెంకట నగర్ కుప్పంలో గడపగడపకు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జాలర్లను ఉద్దేశించి మాట్లాడుతూ ఈ దీవి నుండి రోడ్డు పక్కన ఉన్న పూడికుప్పం వద్ద ఇళ్ల స్థలాలు కోరుతున్న సమస్యను రెండు వారాలలో పరిష్కరిస్తానన్నారు. జాలర్లకు కనీస సౌకర్యాలు కల్పించేందుకు ప్రభుత్వం ఎప్పుడూ ముందుకు వస్తుందని చెప్పారు. ఎమ్మెల్యే వెంట ఏపి కార్పొరేషన్ ఆఫ్ ఫిషరీస్ కొండూరు అనిల్ బాబు, తడ మండల అధ్యక్షులు కొలవి రఘు, వైసిపి నాయకులు కె. ఆర్ముగం, కె. శేఖర్ బాబు, కె. వాసు మొదలి, రత్నం, ఎంపిడిఓ ఆమోస్ బాబు, తహశీల్దార్ జయజయ రావు, సూళ్లూరుపేట సిఐ వెంకటేశ్వర రెడ్డి, తడ ఎస్ఐ శ్రీనివాస రెడ్డి, తదితరులు పాల్గొన్నారు. ఇరకందీవికి చెందిన గుణశేఖర్, వినోద్ తదితరులు స్వాగతం పలికారు. భీములవారి పాలెం నుండి పులికాట్ సరస్సులో పడవ మీద ఎమ్మెల్యే బృందం ఈ దీవికి తరలివెళ్లింది. అంతకుముందు తడ కుప్పంలో వార్డు సభ్యుడు వినాయగంను ఎమ్మెల్యే పరామర్శించారు. ఆయన తల్లి ఇటీవల మృతి చెందడంతో సంజీవయ్య నేరుగా వినాయగం ఇంటికి వెళ్లారు.

## విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించకుంటే చర్యలు

**- ఫుడ్ కమిషన్ ఛైర్మన్ జయప్రతాపరెడ్డి**



వెంకటగిరి, సెప్టెంబర్ 4, ప్రభాతవార్త:

పాఠశాలలల్లో, అంగన్‌వాడీ కేంద్రాల్లో సీఎం జగన్మోహన్‌రెడ్డి విద్యార్థుల కోసం పౌష్టికాహారాన్ని అంది స్తున్నట్లు ఫుడ్ కమిషనర్ ఛైర్మన్ జయప్రతాప్‌రెడ్డి తెలిపారు. వెంకటగిరి పట్టణంలోని గురుకుల పాఠశాల, మోడల్ స్కూల్, అంగన్‌వాడీ కేంద్రాలను ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భవతులు, చిన్నారులకు అందజేస్తున్న పౌష్టికాహారం తింటే బలంగా ఉంటారని తెలిపారు. విద్యార్థులకు నిబంధనల ప్రకారం పౌష్టికాహారాన్ని అందజేయకుంటే ఉద్యోగులపై చర్యలు తీసుకుంటామన్నారు. మోడల్ స్కూల్‌లో కోడిగుడ్లు పరిమాణం తక్కువగా ఉన్నాయని, పెద్దవే తీసుకోవాలని ప్రిన్సిపాల్‌కు సూచించారు. రాణిపేటలోని అంగన్‌వాడీ కేంద్రంలో పౌష్టికాహారం ఇవ్వకనే ఇచ్చినట్లు రికార్డు నమోదు చేయడం పట్ల అంగన్‌వాడీ వర్కర్‌కు మెమో ఇవ్వాలని పీడీని ఆదేశించారు. ఆయన వెంట ఎంపీడీవో విజయలక్ష్మీ, ఎంఈవోలు వెంకటేశ్వర్లు, కిలారి వెంకటేశ్వర్లు, బాబయ్య, సీడీపీవో శంషాద్ బేగం తదితరులు ఉన్నారు.

## రేపటినుంచి శ్రీకృష్ణాష్టమి వేడుకలు

కుప్పం, సెప్టెంబర్ 4 ప్రభాతవార్త

కుప్పం పట్టణం గుడుపల్లె రోడ్‌లో నెలకొన్న శ్రీ ప్రసన్న కృష్ణార్జున ఆలయంలో ఈనెల6,7 తేదీల్లో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు నిర్వహిస్తున్నట్లు ఆలయ ధర్మకర్త బిఎం దయానిధి తెలిపారు. 6.7వతేదీల్లో ఉదయం స్వామివారికి అభిషేకం, విశేష పూజలు జరుగుతాయన్నారు.భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

## రాజుకాలువ ఆక్రమణపై తహాశీల్దార్‌కు ఫిర్యాదు



కుప్పంరూరల్, సెప్టెంబర్ 4 ప్రభాతవార్త

కుప్పం మున్సిపాలిటీ పరిధి కమతమూరు గ్రామంలో ఉన్న రాజు కాలువను కొంతమంది ప్రైవేట్ వ్యక్తులు ఆక్రమించి లేఔట్ వేశారని సోమవారం పలువురు గ్రామస్తులు తహశీల్దార్ పార్వతికి ఫిర్యాదు చేశారు. గ్రామ సమీపంలోని వర్లనాయనచెరువుకు సంబంధించిన రాజుకాలువను పూడ్చి వేయడంతో పాటు అక్రమవగా లే ఔట్ వేశారని పేర్కొన్నారు. అధికారులు స్పందించి రాజుకాలువ దురాక్రమణకు పాల్పడిన వ్యక్తులపై తగు చర్యలు తీసుకోవాలని కోరారు. దీనిపై తహశీల్దార్ స్పందించి స్థలాన్ని పరిశీలిస్తామని పేర్కొనడంతో గ్రామస్తులు వెనుతిరిగారు.

# తిరుపతి డివిజన్

## దొంగ ఓట్లను తొలగించండి..!

### టిడిపి నియోజకవర్గ ఇన్‌చార్జ్ పులివర్తి నాని

రామచంద్రాపురం, సెప్టెంబర్ 4 ప్రభాతవార్త: దొంగ ఓట్ల నమోదును నిర్మూలించి దొంగ ఓట్లను తొలగించాలని టిడిపి నియోజకవర్గ ఇన్‌చార్జ్ పులివర్తి నాని కోరారు. సోమవారం టిడిపి మండల నాయకులతో కలసి దొంగ ఓట్లను తొలగించాలని కోరుతూ తహశీల్దార్ జి.సి.వెంకటేశ్వర్లుకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాలలో తెలుగుదేశం పార్టీ అభిమానులు, సానుభూతిపరుల ఓట్లను తొలగించాలని బిఎల్‌ఓలపై ఎంఎల్‌ఏ చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి వత్తిడి తీసుకువస్తున్నట్లు ఆరోపించారు. వైసిపి సానుభూతిపరుల ఓట్లు, మరణించిన, వివాహమై ఇతర ప్రాంతాలకు వెళ్ళిన వారి ఓట్లను తొలగించడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు తిరుమల రెడ్డి, నాయకులు చినబాబు, జనార్ధన్ చౌదరి, కోరా హరిప్రసాద్, గిరిధర్ రెడ్డి, రావిళ్ళ గిరి, సురేంద్ర నాయుడు, ఉమాపతి నాయుడు, నరశింహా రెడ్డి, రామిరెడ్డి, మహేష్ నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

## అర్హతే ప్రమాణికంగా సంక్షేమ పథకాలు

### వైసిపి యువజన నాయకుడు చెవిరెడ్డి హర్షిత్ రెడ్డి



రామచంద్రాపురం, సెప్టెంబర్ 4 ప్రభాతవార్త: అర్హతే ప్రమాణికంగా ప్రభుత్వం సంక్షేమ పథకాలు అందిస్తుందని వైసిపి యువజన నాయకుడు చెవిరెడ్డి హర్షిత్ రెడ్డి అన్నారు. సోమవారం బొప్పరాజుపల్లి గ్రామంలో గడపగడపకు హర్షిత్ రెడ్డి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు మంగళ హారతులతో ఆయనకు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆయన గడగడపకు తిరిగి ప్రభుత్వ సంక్షేమ పథకాల కరపత్రాలను పంపిణీ చేశారు. వచ్చే ఎన్నికలలో మా అన్న చెవిరెడ్డి మోహిత్ రెడ్డిని ఎంఎల్‌ఏగా గెలిపించాలని అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో జడ్పీటిసి ఢిల్లీరాణి భానుకుమార్ రెడ్డి, సింగిల్ విండో అధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి, సర్పంచ్ గోవర్ధన్, పంచాయతీ కన్వీనర్లు శిరిపిరెడ్డి సతీష్‌కుమార్‌రెడ్డి, కేశవులురెడ్డి, నాయకులు అప్పన మోహన్, శేఖర్‌లు పాల్గొన్నారు.

## గూడు లేని వారినిగా చేయొద్దు



రేణిగుంట, సెప్టెంబరు 4 ప్రభాతవార్త: చెన్నై-తిరుపతి 3వ రైల్వేలైన్ నిర్మాణంలో భాగంగా తమ గుళ్లు చెదిరిపోతున్నాయని రేణిగుంట మండలం తూకివాకం పంచాయతీ గువ్వల కాలనీ వాసులు ఆవేదనతో స్థానిక ఎంపీడీవో కార్యాలయం వద్ద సీపీఎం నేతలతో కలసి నిరసన వ్యక్తం చేస్తూ సోమవారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పెంచిన నిత్యావసర సరకులు వెంటనే తగ్గించాలని డిమాండ్ చేశారు. గ్రామీణ ఉపాధిహామీలో భాగంగా 200 రోజులు పని కల్పించాలన్నారు. కార్యక్రమంలో గువ్వల సంఘం నాయకులు అలీబాబా, గిరిజన సంఘం నేతలు హరినాథ్, ఈవ్వరమ్మ, కేవీపీఎస్ నాయకులు సెల్వరాజు, ఎరుకల సంఘం నాయకురాలు ఈశ్వరమ్మ, ఎంపీటీసీ రాజేశ్వరి, సీపీఎం పార్టీ నేతలు దిలీప్ బాషా, ఓ.వి.రమణ, శివానందం, నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## భవిష్యత్‌కు గ్యారంటీ కరపత్రాల పంపిణీ



విజయపురం, సెప్టెంబరు 4 ప్రభాతవార్త : మండలంలోని పన్నూరు, కళియంబాకంలో మీ భవిష్యత్‌కు నేను గ్యారంటీ కరపత్రాలను తెలుగుదేశం పార్టీ నాయకులు పంపిణీ చేశారు. రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం అభివృద్ధిని మరిచి అప్పులో ఊబిలో నెట్టిందని విమర్శించారు. రానున్న ఎన్నికల్లో టిడిపిని ఆదరించాలని కోరారు. కార్యక్రమంలో మండల తెలుగు మహిళా అధ్యక్షురాలు గుణ భూషణమ్మ, నాయకులు గుణశేఖర్‌రెడ్డి, ముకుందరెడ్డి, శరత్ తదితరులు పాల్గొన్నారు.

## అభూత కల్పనకు తెరతీసిన టీడీపీ...పచ్చతమ్ముళ్ళకే పసుపు కండువాలు

నగరి, సెప్టెంబరు 4 ప్రభాతవార్త: పచ్చతమ్ముళ్ళను కలిపి పార్టీలో చేర్చుకుంటూ పదుల సంఖ్యలో కుటుంబాలు టీడీపీలోచేరిందని నిస్సిగ్గుగా టీడీపీ నాయకులు డప్పు కొడుతూ విష ప్రచారానికి తెర తీస్తున్నారంటూ వైసీపీ నాయకులు ఆరోపించారు. దళిత కుటుంబాలు అధిక సంఖ్యలోపార్టీలో చేరినట్లు టీడీపీ నాయకులు ప్రచారం చేసుకోవడంపై స్థానిక వైసీపీ పార్టీ నాయకులు మున్సిపల్ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో స్పందించారు. ముఖ్యమంత్రి నగరి పర్యటనలో వైసీపీలో వచ్చిన జోష్‌ను చూసి మతిభ్రమించి టీడీపీ నేత భానుప్రకాష్ కొంత మేరకైనా ఆ జోష్‌ను అడ్డుకోవాలన్న దుర్భుద్ధితోనే నీచరాజకయాలకు పాల్పడుతున్నారంటూ దుమ్మెత్తి పోశారు. కీళపట్టు నుంచి 30 కుటుంబాలు వైసీపీలో చేరిందంటూ టీడీపీ నాయకులకే పార్టీ కండువాలు వేసి ప్రచారం చేయడమే ఇందుకు తార్కాణమన్నారు. ఒక్కరు పార్టీ మారినా వందల సంఖ్యలో మారినట్లు ప్రచారం చేస్తున్నారని ఇదేం వింత రాజకీయాలంటూ జనం నవ్వుకుంటున్నారన్నారు. సమావేశంలో మున్సిపల్ చైర్మన్ నీలమేఘం, వైస్ చైర్మన్ బాలన్, కీళపట్టు దళితవాడకు చెందిన వైసీపీ నాయకులు యాబోకు, ఆర్ముగం, యోవాన్, రమేష్, జయరాజ్, చిన్నా, కౌన్సిలర్లు దయానిధి, గోపాల్‌రెడ్డి, ఇంద్రయ్య, మురుగయ్య, కో-ఆప్షన్ సభ్యులు ఎల్లప్పరెడ్డి, దయాళన్, జ్యోతిప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

## ఎన్నికల సమయంలో వస్తారు...ఎన్నికలవగానే ఉడాయిస్తారు!

### -కరోనా సమయంలో ఏమయ్యారని నిలదీయండి: ఎంఎల్‌ఏ



శ్రీకాళహస్తిరూరల్, సెప్టెంబర్ 4 ప్రభాతవార్త : ఎన్నికల సమయంలో తగుదనమ్మా అంటూ వస్తారు. పిలవని పేరంటమన్నట్లు వివాహాలకు హాజరౌతారు. చావులకు, పెళ్ళిళ్ళకు తెగ తిరిగేస్తారు. ఎన్నికల్లో ఓట్లు వేసుకొని హైదరాబాదుకు ఉడాయిస్తారు. కరోనా సమయంలో ఏమయ్యారని బొజ్జల కుటుంబాన్ని నిలదీయాలని శాసనసభ్యుడు బియ్యపు మధుసూధనరెడ్డి పిలుపు నిచ్చారు. సోమవారం శ్రీకాళహస్తి మండలం అక్కుర్తి గ్రామంలో నూతనంగా నిర్మించిన సచివాలయం, ఆర్‌బికే భవనాలను శాసనసభ్యుడు మధుసూధనరెడ్డి ప్రారంభిం చారు. ఏర్పాటు చేసిన సభలో మాట్లాడుతూ అక్కుర్తి గ్రామంలో నూతన ప్రారంభోత్సవాలు చేయటం తనకు ఎంతో సంతోషంగా ఉందన్నారు. 30 సంవత్సరాల పాటు నిరాటంకంగా పరిపాలించిన పాలకులకు సాధ్యం కానిది నేడు జగనన్న ప్రభుత్వం పేద ప్రజలకు అందిస్తూ అసాధ్యాలను సుసాధ్యాలు చేసి చూపుతున్నారని వివరించారు. ఎన్నికలు సమీపిస్తుండగా బొజ్జల కుటుంబం హైదరాబాదు నుంచి దిగుమతి అవుతారు. గత 30 సంవత్సరాలుగా అదే జరుగుతుందని వివరించారు. ఎంపిపి సంపూర్ణమ్మ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో జడ్‌పిటిసి సుబ్బారెడ్డి పర్యవేక్షణలో కార్యక్రమాలు నిర్వహించారు. మండల నాయకులు బర్రెహేమ భూషణరెడ్డి సర్పంచ్ ఎం.కృష్ణయ్య, కే.పోలిరెడ్డి, వి.సురేంద్ర యాదవ్, ఎంపిటిసి రాములమ్మ, భానుమూర్తి, శంకర్‌రెడ్డి, ఉన్నం వాసుదేవనాయుడు, వడ్లతాంగళ్ బాలాజి ప్రసాద్‌రెడ్డి, నాగార్జున్‌రెడ్డి, ప్రభాకర్, సుబ్బరామిరెడ్డి, నాగూర్‌రెడ్డి, రాఘవరెడ్డి, శంకరయ్య, విజయభాస్కర్, సురేంద్ర, శంకర్‌రెడ్డ, ప్రబాకర్ తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడుగా సుబ్రమణ్యం



తొట్టంబేడు, సెప్టెంబర్ 4 ప్రభాతవార్త : ప్రతి ఏడాది ఉపాధ్యాయ దినోత్సవం రోజున గురువులకు ఉత్తమ ఉపాధ్యాయులకు అందించే అవార్డులను జిల్లా విద్యాశాఖ ప్రకటించింది. ఈనేపధ్యంలో తొట్టంబేడు మండలంలోని కళ్ళిపూడి ప్రాథమికోన్నత పాఠశాలలో సాంఘికశాస్త్ర ఉపాధ్యాయుడుగా పనిచేస్తున్న కె.సుబ్రమణ్యంకు జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును నేడు జిల్లా అధికారుల చేతులమీదుగా అందుకోనున్నారు. కాగా మండల ఉత్తమ ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలను నేడు మండలంలో నిర్వహిస్తున్నారు. వీరిలో కొత్తకండ్రిగ(పికె) పాఠశాలకు చెందిన గీతావాణి(ఎస్‌జిటి), కొణతనేరి ఎంపిపిఎస్‌లో పనిచేస్తున్న బిఎన్.మునిరాజ(ఎస్‌జిటి), రామచంద్రాపురం గ్రామంలోని గిరిజన పాఠశాల హెచ్ఎం బి.గోపిలకు అందించనున్నారు. మధ్యాహ్నం 3గంటలకు కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని ఎంఈవో భారతీ తెలిపారు.

## సత్రవాడలో 50 మందికి నూతన పెన్షన్లు

నగరి, సెప్టెంబరు 4 ప్రభాతవార్త: మున్సిపల్ పరిధి సత్రవాడలో 50 మందికి నూతన పెన్షన్లు మంజూరయ్యాయి. సోమవారం పెన్షన్లను స్థానిక ప్రజాప్రతినిధులు సమక్షంలో సచివాలయ సిబ్బంది వలంటర్లు లబ్ధిదారులకు అందించారు. ఈ సందర్భంగా రాష్ట్ర మొదలియార్ కార్పొరేషన్ డైరెక్టర్ బాలకృష్ణ మాట్లాడుతూ ప్రభుత్వం నిరంతరం ప్రజాసేవలో కొనసాగు తోందన్నారు.

## తుడ చైర్మెన్ చొరవతో.... గంగమ్మ ఆలయ నిర్మాణం



తిరుపతిరూరల్, సెప్టెంబర్ 4 ప్రభాతవార్త: తిరుపతిరూరల్ మండలం సప్తగిరికాలనీలో తుడ చైర్మెన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి చొరవతో గంగమ్మ ఆలయ నిర్మాణానికి నాంది పలికారు. సోమవారం సప్తగిరి కాలనీ పంచాయతీకి చెందిన 50 అంకణాల స్థలంలో గంగమ్మ ఆలయ నిర్మాణానికి మోహిత్‌రెడ్డి భూమిపూజ చేసారు. మునుపువున్న అమ్మవారి విగ్రహానికి తుడ చైర్మెన్ ప్రత్యేక పూజలు చేసారు. ఎన్నో ఎళ్లుగా పరిష్కారానికి నోచుకొని సమస్యగా మిగిలిన గంగమ్మ ఆలయ నిర్మాణం తుడ చైర్మెన్ చొరవతో పూర్తి కాబోతుందని స్థానిక ప్రజలు ఆనందం వ్యక్తం చేసారు. ఈ కార్యక్రమంలో బిటిఆర్ కాలనీ సర్పంచ్ లీలావతి లక్ష్మీనారాయణ, సప్తగిరి కాలనీ ఉప సర్పంచ్ వసంత అశోక్‌కుమార్‌రెడ్డి, వైకాపా నాయకులు పాల్గొన్నారు..

## సిటీచాంబర్ సేవా కార్యక్రమాలకు...స్విమ్స్ చేయూత

### -స్విమ్స్ డైరెక్టర్ డాక్టర్ ఆర్ వి కుమార్



తిరుపతి, సెప్టెంబర్ 4ప్రభాతవార్త: సమాజసేవలో తనదైన శైలిలో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ, అనాథలు, పేదలను ఆదుకుంటూ, వారి ఆకలి తీర్చుతున్న, పశువులకు గ్రాసం అందిస్తున్న తిరుపతి సిటీచాంబర్ సేవలు అమోఘమని స్విమ్స్‌డైరెక్టర్ డాక్టర్ ఆర్‌వి కుమార్ తెలిపారు. ఇప్పటివరకు సిటీచాంబర్ వ్యవస్థాపక అధ్యక్షుడు అయూబ్‌ఖాన్ ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహిం చారని అభినందించారు. సేవకు మారుపేరుగా సిటీఛాంబర్ నిలచిందన్నారు. ఇలాంటి కార్యక్రమాలు నిరంతరం కొనసాగాలని, ఎలాంటి సహాయసహకారాలు అందించడానికి స్విమ్స్ ముందుంటుందని డాక్టర్ కుమార్ హామీ ఇచ్చారు. గతంలో నిర్వహించిన సేవా కార్యక్రమాల బ్రోచర్‌ను సోమవారం డాక్టర్ ఆర్‌వి కుమార్ విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో సిటీఛాంబర్ ప్రతినిధులు డాక్టర్‌కరుణానిధి, దీపిక, స్టాలిన్ నందిని తదితరులు పాల్గొన్నారు.

## ఉత్తమ అధ్యాపకులుగా ఎన్నికైన ప్రొఫెసర్లు

తిరుపతి (విద్య), సెప్టెంబర్ 4 ప్రభాతవార్త : విద్యా పరిరక్షణ సమితి ప్రతి సంవత్సరం ఉత్తమ ఉపాధ్యాయులకు అందించే ప్రతిష్టాత్మకమైన అవార్డు ఈ సంవత్సరం మహిళా విశ్వవిద్యాలయంలోని ఇంగ్లీష్ డిపార్ట్మెంట్ ప్రొఫెసర్ శారత, ఫార్మసీ డిపార్ట్మెంట్ ప్రొఫెసర్ జోత్స్నలను వరించింది. మహిళా విశ్వవిద్యాలయం సావేరి సెమినార్ హాల్‌లో జరిగిన ఈ కార్యక్రమానికి వర్సిటీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ భారతి ముఖ్య అతిధిగా విచ్చేయగా, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ రజని అతిధిగా విచ్చేశారు. ఈ సందర్భంగా అవార్డు గ్రహితలను అధికారులు అధ్యాపకులు అభినందించారు. ఉత్తమ అధ్యాపకులుగా ఎన్నికైన ప్రొఫెసర్‌లను సన్మానిస్తున్న దృశ్యం

## ఉదయనిధి స్టాలిన్‌ని వెంటనే అరెస్టు చేయాలి



తిరుపతి (క్రీడా), సెప్టెంబర్ 4 ప్రభాతవార్త : సనాతన ధర్మం ఒక రోగం లాంటిది దానిని నిర్మూలించాలి అంటూ నీచమైన మాటలు మాట్లాడిన చెపాక్ నియోజకవర్గం ఎమ్మెల్యే, మంత్రి అయిన ఉదయనిధి స్టాలిన్‌ని వెంటనే అరెస్టు చేయాలని సనాతన ధర్మ పరిరక్షణ సమితి అధ్యక్షులు చినేపల్లి కిరన్ కుమార్, ప్రకాష్, బాలాజీ, బాలకృష్ణలు సోమవారం ఎస్వీయూ పోలీస్ స్టేషన్ నందు ఫిర్యాదు చేసారు. రాజ్యాంగ బద్ధమైన ఎమ్మెల్యేగా ఉంటూ సనాతన ధర్మాన్ని కరోనా, డెంగ్యూ లాంటి రోగాలతో పోల్చుతూ రోగాలను నిర్మూలించినట్లు సనాతన ధర్మాన్ని కరోనా, డెంగ్యూ లాంటి రోగాలతో పోల్చుతూ రోగాలను నిర్మూలించినట్లు సనాతన ధర్మాన్ని కూడా నిర్మూలించాలని అనడం అతనిలోని పైసాచికత్వానికి నిదర్శనం. వెంటనే ఇతనిని శాస్వతంగా రాజకీయాల నుండి తొలగిస్తూ అరెస్టు చేయ్యాలి, ఇలాంటి మాటలు ఇంకెవ్వరూ మాట్లాడకుండా కఠినమైన చట్టాలు తీసుకురావాలని కోరారు.

## ఓటిఎస్ పథకం పై ప్రజలకు అవగాహన కల్పించండి

### అధికారులను ఆదేశించిన జిల్లా జాయింట్ కలెక్టర్



తిరుపతి కార్పొరేషన్, సెప్టెంబర్ 4 ప్రభాతవార్త :ఓటిఎస్ పథకం పై ప్రజలకు అవగాహన కల్పించాలని అధికారులను జాయింట్ కలెక్టర్ డికే బాలాజీ ఆదేశించారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ఎంపిడిఓలు, మున్సిపల్ కమిషనర్‌తో ఓటిఎస్ పథకం పై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్బంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ ఓటిఎస్ పథకం సర్వే, రిజిస్ట్రేషన్ల ప్రక్రియ వేగవంతం చేయాలని అధికారులను సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం గృహ నిర్మాణ లబ్ధిదారులకు శాశ్వత ఇంటి రిజిస్ట్రేషన్ చేయించడానికి రాష్ట్ర ప్రభుత్వం వన్ టైం సెటిల్మెంట్ పథకాన్ని తీసుకురావడం జరిగిందన్నారు. ఓటిఎస్ ప్రక్రియను సంబంధించిన సర్వే, రిజిస్ట్రేషన్ల ప్రక్రియపై ఎంపిడిఓలు అందరూ దృష్టి పెట్టి పూర్తి చేయాలని తెలిపారు. ఓటిఎస్ రిజిస్ట్రేషన్ పూర్తయిన వారికి ఇంటి పై వారికి సంపూర్ణ హక్కు కలిగి ఉండడం ద్వారా సులభంగా క్రయ విక్రయాలు జరుపుకోవడానికి అవకాశం ఉంటుందని అన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ పిడి వెంకటేశ్వరరావు, ఎంపిడిఓలు మున్సిపల్ కమిషనర్లు, హౌసింగ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## మతోన్మాద శక్తుల నుండి దేశాన్ని కాపాడండి: సిపిఐ



చంద్రగిరి, సెప్టెంబర్ 4 ప్రభాతవార్త: మతోన్మాద శక్తుల నుండి భారత దేశాన్ని కాపాడాలని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రామానాయుడు కోరారు. స్థానిక టవర్ క్లాక్ వద్ద సోమవార ం సిపిఐ ఆధ్వర్య లో గోడ పత్రికలను ఆవిష్కరించారు. ఈ సందర్భ ంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 8న తిరుపతి లో జరిగే బహిరంగ సభను విజయవంతం చేయా లని కోరారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ఖండిస్తూ నిర్వహిస్తున్న కార్యక్రమం అన్నారు. భిన్నమతాలు, భిన్న సంస్కృ తులు కలిగిన దేశంలోని ప్రజలు భిన్నత్వంలో ఏకత్వంతో జీవిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో చంద్రగిరి నియోజకవర్గసభ్యుడు శ్రీరాములు, కె.వై.రాజా, శేఖర్, నగేష్, గోపి, రామకృష్ణ, పెద్దయ్య, దాము, తదితరులు పాల్గొన్నారు.

## అధికారికంగానే దొంగ ఓట్ల చేర్పులు

### టిడిపి చంద్రగిరి నియోజకవర్గ ఇన్‌చార్జ్ పులివర్తి నాని

చంద్రగిరి, సెప్టెంబర్ 4 ప్రభాతవార్త: ఇప్పటి వరకు రాజకీయ పార్టీల నాయకులు దొంగ ఓట్లను చేర్పించడం చూశాం అయితే ఇప్పుడు అధికారికంగా దొంగ ఓట్లను అధికారులు చేర్పులు చేస్తుండట ం హేయమైన చర్య అని టిడిపి చంద్రగిరి నియోజకవర్గ ఇన్‌చార్జ్ పులివర్తి నాని దుయ్యబట్టారు. స్థానిక రెవెన్యూ కార్యాలయంలో ఈ మేరకు సోమవారం ఆయన డిప్యూటీ తహశీల్దార్ అమృతకు వినతి పత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర స్థాయిలో అత్యధికంగా దొంగ ఓట్లు కలిగిన నియోజకవర్గాలలో చంద్రగిరి వుండటం సిగ్గుచేటని అన్నారు. దొంగ ఓట్లకు వ్యతిరేకంగా టిడిపి ఆధ్వర్యంలో చేపట్టిన పోరాటాలకు కేంద్ర, రాష్ట్ర ఎన్నికల కమీషన్‌లు స్పందించడంతో బిఎల్‌ఓ స్థాయి నుండి జిల్లా కలెక్టర్ వరకు దొంగ ఓట్ల ఏరివేతలో పాల్గొన్నట్లు తెలిపారు. కేంద్ర ఎన్నికల సంఘం దృష్టి పెట్టినప్పటికీ ఎంఎల్‌ఏ వత్తిడికి తలొగ్గి అధికార యంత్రాంగం దొంగ ఓట్ల చేర్పులకు పాల్పడుతుండటం క్షమించరాని నేరమన్నారు. అవసరమైతే దొంగ ఓట్ల చేర్పులపై అధికారులను కోర్టు లాగుతామన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు పల్లినేని సుబ్రమణ్యం నాయుడు, ప్రధాన కార్యదర్శి కొండూరు ప్రవీణ్ రాయల్, నాయకులు ఏజి పల్లి బాల, ప్రభాకర్ నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధిహామీ పనుల తనిఖీ



తొట్టంబేడు, సెప్టెంబర్ 4 ప్రభాతవార్త : మండలంలో ఉపాధిహామీ పనులు వేగవంతం చేయాలని పథక సంచాలకులు శ్రీనివాసప్రసాద్ సంబందిత ఎపిఓ, క్షేత్రస్థాయి అధికారులకు సూచించారు. సోమవారం ఆయన చిట్టత్తూరు పంచాయతీలో జరుగుతున్న ఊటగుంట పూడికతీత పనులను తనిఖీచేశారు. ఆయన మాట్లాడుతూ కూలీలకు అవసరమైనసదుపాయాలు కల్పించాలన్నారు. ఆయనతో పాటు ఎపిడి ప్రేమ్‌కుమార్, ఎపిఓ సుజాత, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

## నేడు మండల సర్వసభ్య సమావేశం

తొట్టంబేడు, సెప్టెంబర్ 4 ప్రభాతవార్త : నేడు ఉదయం 10గంటలకు మండల సర్వసభ్య సమావేశం ఉంటుందని ఎంపిడిఓ సురేష్‌బాబు తెలిపారు. సమావేశానికి ముఖ్యఅతిధిగా ఎంఎల్‌ఏ బియ్యపు మధుసూధన్‌రెడ్డి ఆయనతో పాటు ఎంపిపి ఉన్నం నిర్మలవాసునాయుడు, జడ్పీటిసి అర్చనాదేవిలు హాజరవుతారని అన్నిశాఖల అధికారులు తమ తమ నివేదికలతో తప్పకహాజరవ్వాలన్నారు.

## టిఎంవి కండ్రిగలో సిపాయి భరోసా



శ్రీకాళహస్తిరూరల్, సెప్టెంబర్ 4 ప్రభాతవార్త : శ్రీకాళహస్తి నియోజకవర్గంలో ఎంఎల్‌సి, రష్ అధినేత డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం వివిధ పథకాల పేరుతో ప్రజలనూ ఆకర్షిస్తున్నారు. తన సామాజిక వర్గానికి చెందిన ప్రజలు అధికంగా ఉన్న గ్రామాల్లో ఎవరైనా ఇబ్బంది పడుతుంటే 'సిపాయి భరోసా' కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్బంగా టిఎంవి కండ్రిగలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ముఖ్య అతిథి గా విచ్చేసిన డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం మాట్లాడుతూ ప్రజలకు ఎల్లవేళల్లో అందుబాటులో ఉంటానని తెలిపారు. సోమవారం టిఎంవి కండ్రిగ గ్రామంలో ఇటీవల మృతి చెందిన ధర్మారెడ్డి కుటుంబానికి డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం సిపాయి భరోసాగా 40 రకాల నిత్యావసర సరకులు అందించారు. ఈ కార్యక్రమాల్లో రెడ్డి పెరుమాళ్‌రెడ్డి, భరత్‌రెడ్డి, వెంకటరెడ్డి, గురువారెడ్డి, ఆకులమ్మ, కులయప్పరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## భద్రత విధానాలను ఖచ్చితంగా పాటించాలి:రైల్వేజిఎం



తిరుపతి(రవాణా), సెప్టెంబర్ 4ప్రభాతవార్త: రైళ్ల రాకపోకల సమయంలో కార్యకలాపాల భద్రత, లోడింగ్ పనితీరు, జోన్‌వ్యాప్తంగా వివిధ అభివృది పనుల పురోగతిపై సోమవారం సికింద్రాబాద్ దక్షిణ మధ్యరైల్వే జిఎం అరుణ్‌కుమార్‌జైన్ సమీక్షించారు. ప్రధాన అధిపతులు గుంతకల్, గుంటూరు, సికింద్రాబాద్, హైదరాబాద్, నాందేడ్ డివిజన్లకు చెందిన మొత్తం డిఆర్ఎంలు, చీఫ్ వర్కుషాప్ మేనేజర్లు వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. రైళ్లను సురక్షితంగా నడిపేందుకు భద్రతా అంశాలను వివరించారు. రైలు సురక్షిత కోసం శిక్షణ ఉంటుందన్నారు. రైళ్ల వేగంపై సమీక్ష, , మౌళిక సదుపాయాలు మెరుగుపరచడం, కొత్తసిగ్నలింగ్ వ్యవస్థ తదితర వాటిపై డిఆర్ఎంలకు సూచనలు చేశారు.

## వైద్య విద్యను బీసీలకు దూరం చేస్తున్న జగన్మోహన్ రెడ్డి

### -టిడిపి పార్లమెంట్ బీసీ సెల్ అధ్యక్షుడు రుద్రకోటి సదాశివం



తిరుపతి కలెక్టరేట్, సెప్టెంబర్ 4 ప్రభాతవార్త : బీసీలకు వైద్య విద్యను దూరం చేసేలా రాష్ట్ర ప్రభుత్వం వ్యవహరించడం దుర్మార్గమని టిడిపి పార్లమెంట్ బీసీ సెల్ అధ్యక్షులు రుద్రకోటి సదాశివం అన్నారు. సోమవారం తేదేపా రాష్ట్ర బిసి విభాగం అధ్యక్షులు కొల్లు రవీంద్ర అదేశాలతో తిరుపతి జిల్లా కలెక్టర్‌ను కలిసి వినతి పత్రం అందజేసారు. అనంతరం కలెక్టర్ కార్యాలయం ఎదుట కొద్దిసేపు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రుద్ర కోటి సదాశివం మాట్లాడుతూ రాష్ట్రంలో కొత్తగా ఏర్పాటైన ప్రభుత్వ మెడికల్ కళాశాలలో సీట్లను అమ్మకానికి పెడుతూ తీసుకున్న నిర్ణయం అత్యంత దుర్మార్గమైన చర్యగా ఆయన అభివర్ణించారు. కన్వీనర్ కోటలో 50 శాతం సీట్లు, సెల్ఫ్ ఫైనాన్సింగ్ విధానంలో 35 సీట్లను, ఎన్నారై కోటలో 15 శాతం సీట్లను భర్తీ చేయాలని నిర్ణయించడం సరికాదన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి బీసీ నాయకులు మునిస్వామి, రేణుకమ్మ, మిన్నల రవి, విశ్వనాథం, ఎంఎస్ రెడ్డి, దొరై రాజ్ రెడ్డి, ఆముదాల తులసీదాస్, పరందామయ్య, కన్నవరం హరిబాబు, జగన్నాథం, భక్తవత్సలం, భాస్కర్ యాదవ్, షణ్ముగం ఆచారి, శ్రీరాములు, అనిత, దుర్గ, శ్రీనివాసులు రెడ్డి, దయానిధి, వెంకటరమణ, రామయ్య, కుమార్, జగదీష్, మునయ్య, ప్రసాద్, చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.

## బాబు ష్యూరిటీ-భవిష్యత్తు గ్యారెంటీ

### -రాష్ట్ర కార్యదర్శి చలపతినాయుడు



తొట్టంబేడు, సెప్టెంబర్ 4 ప్రభాతవార్త : బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమంపై సోమవారం స్థానిక ఎన్టీఆర్ భవన్‌లో తొట్టంబేడు మండల సమావేశాన్ని రాష్ట్ర కార్యదర్శి గాలి చలపతి నాయుడు ఆధ్వర్యంలో ఏర్పాటుచేశారు. ముఖ్య అతిథులుగా మండల అధ్యక్షులు గాలి మురళీ నాయుడు, పాలసరఫరా మాజీ ఛైర్మన్ రావిళ్ళ మునిరాజనాయుడు, కాసరం భాస్కర్ నాయుడులు విచ్చేశారు. రాష్ట్ర కార్యదర్శి గాలి చలపతినాయుడు మాట్లాడుతూ నేడు రాష్ట్రం రావణ కాష్టంగా మారిందని ప్రశ్నించేవారిపై భౌతికదాడులు జరగడం పరిపాటిగా మారిందన్నారు. రాష్ట్రం ప్రజలు బాగుండాలంటే తెలుగుదేశంపార్టీ అధికారంలోకి రావాలన్నారు. మండల పార్టీ అధ్యక్షుడు గాలి మురళీ నాయుడు మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీకి తొట్టంబేడును మండలాన్ని కంచుకోటగా మార్చుతామన్నారు. ఇందుకు ప్రతి కార్యకర్త, నాయకులతో పాటు, క్లస్టర్, బూత్ ఇన్‌ఛార్జ్‌లు తమ శక్తివంచన లేకుండా చేయాలన్నారు. పలువురు మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## అవకాశాలు..అందిపుచ్చుకోండి : ప్రిన్సిపాల్

నగరి, సెప్టెంబరు 4 ప్రభాతవార్త: కళాశాలలో ఉన్న అవకాశాలను అంది పుచ్చుకుని బాగా రాణించాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డా. వేణుగోపాల్ అన్నారు. గత నెల 8వ తేదీ నుంచి ఈ నెల 2 తేదీ వరకు 21 రోజుల పాటు విద్యార్థులకు నిర్వహించినన ప్రేరణ కార్యక్రమం ముగింపు సమావేశంలో ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కళాశాలలో ఉన్న సౌకర్యాలు, ప్రత్యేకతలు, సంస్థ ప్రవర్తనా నియమావళి గురించి వివరించారు. ఉన్నత విద్యా సంస్థల్లో ఎన్ఈపీ 2020 లక్ష్యాలు, యూజీ స్థాయిలో యూజీసీ కొత్త కరిక్యులర్ ఫ్రేమ్‌వర్క్, ఎస్ సౌకర్య వంతమైన ఎంపిక ఆధారిత క్రెడిట్ సిస్టమ్‌ను విద్యార్థులకు వివరించారు. వివిధ సెమిస్టర్‌లో అందించే మల్టీ-డిసిప్లినరీ కోర్సులు, నైపుణ్యం పెంపొందించే కోర్సుల గురించి కమ్యూనిటీ సర్వీస్ ప్రాజెక్టులు, స్వల్ప కాలిక, సెమిస్టర్ ఇంటర్‌షిప్ గురించి విశధీకరించారు. కళాశాల స్థాయిలోని జేకేసీ, కెరీర్ గైడెన్స్ విభాగాలపై అవగాహన కల్పించారు.

## పరమేశ్వర మంగళం ఉప సర్పంచ్‌గా మంజుల



పుత్తూరురూరల్, సెప్టెంబరు 4 ప్రభాతవార్త: మండలంలోని పరమేశ్వర మంగళం ఉప సర్పంచ్‌గా మంజుల ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు స్టేజ్-2 అధికారి వేణయ్య తెలిపారు. రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు పరమేశ్వరమంగళం ఉప సర్పంచ్ ఎన్నిక సోమవారం నిర్వహించారు. మంజులను పలువురు వార్డు సభ్యులు బలపరచారు. దీంతో ఆమె ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి ప్రకటించారు. ఈమె వైసీపీ సానుభూతి పరురాలు కావడం గమనార్హం. అనంతరం ఎన్నికల అధికారి ఆమె ధృవీకరణ పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వైసీపీ శ్రేణులు సంబరాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మల్లిక, నేసనూరు సర్పంచ్ గోవిందస్వామిరెడ్డి, వైసీపీ నాయకులు దాసు, వినోద్, రంజిత్, లక్ష్మణమూర్తి తదితరులు ఉన్నారు.

## ప్రయాణీకుల నుండి ఫిర్యాదులు రాకుండా చూడండి

### -బస్‌స్టేషన్ సూపర్‌వైజర్లకు డిపిటిఓ చెంగల్‌రెడ్డి ఆదేశం



తిరుపతి ప్రెస్‌క్లబ్, సెప్టెంబర్ 4 ప్రభాతవార్త: రానున్న శ్రీవారి బ్రహ్మోత్సవాల సందర్భంగా దేశం నలుమూలల నుండి వేలాది మంది భక్తులు తిరుమలకు వెళ్లడానికి తిరుపతి సెంట్రల్ బస్‌స్టేషన్‌కు వస్తుంటారు. కావున బస్‌స్టేషన్ ఎప్పుడూ పరిశుభ్రంగా ఉండాలని, ప్రయాణీకులకు అన్ని సౌకర్యాలు కల్పించి, వారి నుండి ఎలాంటి ఫిర్యాదులు రాకుండా చూడాలని ఏపిఎస్ఆర్టీసీ తిరుపతి జిల్లా ప్రజా రవాణా అధికారి తిమ్మాడి చెంగల్‌రెడ్డి బస్‌స్టేషన్‌లోని సూపర్ వైజర్లను ఆదేశించారు. సోమవారం ఆయన సెంట్రల్ బస్‌స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్బంగా ఆయన సూపర్‌వైజర్లను ఉద్దేశించి మాట్లాడుతూ బస్‌స్టేషన్‌లో అన్ని బస్సులను తనిఖీ చేసి డ్రైవర్, కండక్టర్లను అప్రమత్తం చేయాలన్నారు. ప్రయాణీకులతో మర్యాదపూర్వకంగా మెలగాలని, ప్రయాణీకులు చెయ్యి ఎత్తిన చోట బస్సులు ఆపి ఎక్కించుకోవాలని, వారికి సరైనటువంటి టిక్కెట్లు ఇవ్వాలని కోరారు. ఇందులో ఎటువంటి ఫిర్యాదులు రాకుండా చూడాలని, అటువంటి ఫిర్యాదులు వస్తే సిబ్బందిపై తగిన చర్యలు తీసుకుంటామని ఏడుకొండల బస్‌స్టేషన్‌లోని సూపర్‌వైజర్లు, డ్రైవర్లు, కండక్టర్లను హెచ్చరించారు.

## రైలు క్రింద పడి ఇద్దరు వ్యక్తులు మృతి

చంద్రగిరి, సెప్టెంబర్ 4 ప్రభాతవార్త: మండల పరిధిలోని నరశింగాపురం, శ్రీనివాస మంగాపురం వద్ద ఇద్దరు వ్యక్తులు సోమవారం రైలు క్రిందపడి మృతి చెందారు. రైల్వే హెడ్ కానిస్టేబుల్ ఉదయ్‌రెడ్డి అందించిన వివరాల మేరకు.. నరశింగాపురం రైల్వే స్టేషన్‌కు సమీపంలో సుమారు 57 సంవత్సరాలు వయస్సు కలిగిన వ్యక్తి రైలు క్రింద పడి మృతి చెందాడు. అదేవిధంగా శ్రీనివాస మంగాపురం సమీపంలో రైలు పట్టాలపై సుమారు 55 సంవత్స రాలు వయస్సు కలిగిన వ్యక్తి రైలు క్రిందపడి మృతి చెందాడు. కేసులు నమోదు చేసి మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుల వివరాల కొరకు పాకాల రైల్వే పోలీసులను సంప్రదించాలని కోరారు.

# క్రీడలతో మానసిక వికాసం

**ఇకపై క్రీడాకారులకు, క్రీడా సంస్థలకూ సేవా పురస్కారాలు : ఆర్డిఓ**
**విద్యతో పాటు క్రీడల్లోనూ రాణించాలి : డీఎస్పి**
**గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించడమే -వైఎస్సీపీ లక్ష్యం : చేవూరు**




గూడూరు, సెప్టెంబర్ 4, ప్రభాతవార్త : క్రీడలతో శారీరక ధారుడ్యంతోపాటు మానసిక వికాసం కలుగు తుందని ఆర్డిఓ ఎం. కిరణ్ కుమార్ అన్నారు. సోమవారం గూడూరు పట్టణంలోని హెచ్‌డి ఎరీనా షటిల్ బాడ్మింటన్ ఇండోర్ స్టేడియంలో ది యంగ్ గూడూర్ షటిల్ బాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన నియోజకవర్గ స్థాయి షటిల్ క్రీడా పోటీల ముగింపు సమావేశంలో బహుమతుల ప్రధానోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా ఆర్డివో, డీఎస్పి హాజరైయ్యారు. ఈ సందర్భంగా ముఖ్య అతిధిగా ఆర్డివో, డిఎస్పీ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆర్డిఓ మాట్లాడుతూ క్రీడలతో శారీరక ధారుడ్యంతో పాటు మానసిక వికాసం కలుగుతుందన్నారు. చిన్నతనం నుండి ప్రతి ఒక్కరూ ఏదో ఒక క్రీడలో రాణించాలన్నారు. క్రీడల అభివృద్ధికి పాటుపడుతున్న వైజీఎస్పీపి సేవలు స్ఫూర్తిదాయ కమన్నారు. ఇకపై క్రీడలలో రాణించిన వారికి, వివిధ క్రీడల అభివృద్ధికి దోహదపడుతున్న సంస్థలకు సేవా పురస్కారాలు అందిస్తామని సభికుల కరతాళ ధ్వనుల నడుమ ప్రకటించారు. డీఎస్పీ ఎం. సూర్యనారాయణ రెడ్డి మాట్లాడుతూ గూడూరు పట్టణంలో క్రీడా వాతావరణం ఉందన్నారు. క్రీడలతో విద్యార్థులలో క్రమశిక్షణ అలవడుతుందన్నారు. జీవితంలో ఎటువంటి క్లిష్ట సమస్యలు ఎదురైనా ఎదుర్కొనే సత్తా కేవలం క్రీడాకారులకే ఉంటుందన్నారు. విద్యార్థులు జాతీయ అంతర్జాతీయ స్థాయి క్రీడాకారులుగా ఎదగాలని ఆకాంక్షించారు. వైజీఎస్పీపి గౌరవాధ్యక్షులు చేవూరు విజయ్ మోహన్ రెడ్డి మాట్లాడుతూ వైజీఎస్పీపి గత 12 ఏళ్లుగా షటిల్ క్రీడాభివృద్ధికి విశేష కృషి చేస్తోందన్నారు. ప్రతి ఏడాది చిన్న పట్టణమైన గూడూరులో జాతీయ స్థాయి షటిల్ క్రీడా పోటీలను నిర్వహిస్తూ షటిల్ క్రీడ అభివృద్ధికి దోహదపడుతున్నా మన్నారు. వైజీఎస్పీపి గౌరవ సలహాదారు, ఆంధ్రప్రదేశ్ స్టేట్ డిప్లోమా ఇంజనీర్స్ అసోసియేషన్ గౌరవాధ్యక్షులు షేక్ రియాజ్ అహ్మద్ మాట్లాడుతూ వైజీఎస్పీపి 12వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని నియోజకవర్గ స్థాయి క్రీడా పోటీలను నిర్వహించడం చాలా సంతోషంగా ఉందన్నారు. క్రీడాకారులు గెలుపోటములను దృష్టిలో ఉంచకుండా క్రీడా స్ఫూర్తితో మెల గాలని సూచించారు. వైజీఎస్పీపి అధ్యక్షులు షేక్. జమాలుల్లా మాట్లాడుతూ ఆర్డివో సేవలు వెలకట్ట లేమన్నారు. టోర్నమెంట్ ప్రైజ్ మనీకి ఆయన చేసిన సహకారం మరువలేనిదన్నారు. అలాగే షటిల్ టోర్నమెంట్ సూపర్ సక్సెస్‌కు సహకరించిన దాతలకు, వైజీఎస్పీపి సభ్యులకు, మూడు రోజులపాటు క్రీడా పోటీల నిర్వహణకు వేదిక అందించిన హెచ్‌డీ ఎరీనా ఇండోర్ స్టేడియం నిర్వాహకులు దీపు, హర్షలకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం క్రీడాపోటీలో గెలుపొందిన క్రీడాకారులకు అతిధుల చేతుల మీదుగా షీల్డులు, నగదు బహుమతులు అందించారు. అనంతరం అతిధులు, దాతలకు శాలువాలు, మెమొంటోలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆర్డివో ఎం. కిరణ్ కుమార్, డిఎస్పి ఎం. సూర్యనారాయణ రెడ్డి, వైజీఎస్పీపి గౌరవ అధ్యక్షులు చేవూరు విజయ్ మోహన్ రెడ్డి, సలహాదారు షేక్ రియాజ్ అహ్మద్, హోటల్ మహేంద్ర ఎలైట్ అధినేత కోట రామారావు, ఐతా శ్రీహరి, సోమిశెట్టి చెంచురామయ్య, ఎస్వీఎస్పీపి అధ్యక్షులు తాళంకి సురేష్, వైజీఎస్పీపి అధ్యక్షుడు షేక్ జమాలుల్లా, ప్రధాన కార్యదర్శి గిరిబాబు, ఉపాధ్యక్షులు షేక్. అబ్దుల్ కలాం, కార్యదర్శులు, సభ్యులు కోదండపాణి, వల్లూరు రమేష్, ఇంతియాజ్, సునీల్, సాధిక్, మల్లి, మురళీ, స్టేడియం నిర్వాహకులు హర్ష వర్ధన్ రెడ్డి, జెడ్పి బాలుర, బాలికల పాఠశాలలు, ప్రైవేటు పాఠశాలల పీఈటిలు, వైజీఎస్పీపి సభ్యులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

## వినాయక సాగర్ పనులను పరిశీలిస్తున్న కమిషనర్ హరిత



తిరుపతి కార్పొరేషన్, సెప్టెంబర్ 4 ప్రభాతవార్త : వినాయక సాగర్ వద్ద జరుగుతున్న పనులను తిరుపతి నగర పాలక సంస్థ కమిషనర్ హరిత సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ నెల 7న ప్రారంభిస్తున్న వినాయక సాగర్‌ను ప్రారంభోత్సవానికి సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. వినాయక నగర్‌లో సుందరీకరణలో భాగంగా జంతువుల బొమ్మలను ముఖ్యంగా అవి ఏ సైజ్లో వుంటే ఆ విధంగానే లైఫ్ సైజ్‌లో వుండేలా తెప్పించిన సింహం, ఏనుగు, ఎలుగుబంటు, జింక, గుర్రం, అడవి దున్న ప్రతిమలను పరిశీలిస్తూ సరైన ప్రదేశాల్లో వాటిని అమర్చాలని తెలిపారు. ప్రజలకు ఆహ్లాదాన్ని పంచేలా వినాయక సాగర్ మొదల్లో సందర్శకులకు ఆకర్షించే విధంగా స్వాగత ఆర్చ్ ఉండాలన్నారు. అదే విధంగా పచ్చదనం పెంపు, విద్యుత్ వెలుగుల ఏర్పాట్లపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుని త్వరితగతిన పనులు పూర్తి చేసి వినాయక సాగర్‌ను ప్రారంభోత్సవానికి సిద్ధం చేయాలని మున్సిపల్ డిఈ విజయకుమారి రెడ్డికి, కాంట్రాక్టర్ రాజశేఖర్‌కు తిరుపతి నగర పాలక సంస్థ కమిషనర్ హరిత ఆదేశించారు.

## శాస్త్రోక్తంగా సరస్వతీ దేవి ఆలయ కుంభాభిషేకం



చంద్రగిరి, సెప్టెంబర్ 4 ప్రభాతవార్త: చదువుల తల్లి సరస్వతీ దేవి అమ్మవారి ఆలయ కుంభాభిషేక మహోత్సవం శాస్త్రోక్తంగా నిర్వహించారు, స్థానిక ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో ఆది, సోమ వారాలలో విశ్రాంత ఉపాధ్యాయుడు, వైసిపి పట్టణ అధ్యక్షుడు పార్లపల్లి చంద్రశేఖర్ రెడ్డి దంపతులు సరస్వతీ విగ్రహ ప్రతిష్టకు దాతలుగా వ్యవహరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా విచ్చేసిన చెవిరెడ్డి మోహిత్ రెడ్డి హోమం, సరస్వతీ పూజాది కార్యక్రమాల లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను విద్యాభ్యసం చేసిన పాఠశాల ఆవరణలో సరస్వతీ ఆలయం నిర్మించిన పార్లపల్లి దంపతులు అభినందనీయులన్నారు. వ్యాసుడు, కాళిదాసు, వాల్మీకి వంటి వారు సరస్వతీ దేవి అనుగ్రహంతో గొప్ప సాధకులు కాగలరన్నారు. ఎన్నటికీ వన్నెతరగని సాహిత్యాన్ని ప్రపంచానికి అందించారని కొనియాడారు. ప్రతి వ్యక్తిలోని అంధకారాన్ని తొలగించి జ్ఞాన వెలుగులు ప్రసాదించేది చదువుల తల్లి సరస్వతీ అన్నారు. సరస్వతీదేవి నిరంతర ఉపాసన, దర్శన భాగ్యం విద్యార్థుల అభ్యుదయానికి నాంది కాగలదన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి మావిళిరెడ్డిగారి హేమేంద్రకుమార్ రెడ్డి, సర్పంచ్ ముద్దికుప్పం రూపరామమూర్తి, ఎంపిటిసి బుల్లెట్ చంద్రమౌళి రెడ్డి, మాదవరెడ్డి, కోఆప్షన్ సభ్యుడు ఔరంగజేబు, శ్రీ మూలస్థాన ఎల్లమ్మ ఆలయ చైర్మన్ యారాశి చంద్రశేఖర్ రెడ్డి, ఎంఈఓలు శ్రీవరం లలితకుమారి, ప్రభాకర్ రాజు, నాయకులు మల్లం చంద్రమౌళి రెడ్డి, కుప్పిరెడ్డి భాస్కర్ రెడ్డి, పసల నాగరాజ, మస్తాన్, పిడి సక్కుర్ నిరంజన్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## శివయ్య సేవలో అతిథులు



శ్రీకాళహస్తి, సెప్టెంబర్ 4 ప్రభాతవార్త : శ్రీకాళహస్తీశ్వరుని సేవలో సోమవారం పలువురు అతిథులు పాల్గొని పూజలు, దర్శనాలు చేసుకున్నారు. వారికి ప్రోటోకాల్ మేరకు ఆలయాధికారులు స్వాగతం పలికారు. ఈ నేపథ్యంలో ఎంఎల్‌సి, రష్ ఆసుపత్రి అధినేత డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం టిటిడి పాలకమండలి సభ్యుడు పొన్నాడ వెంకట సతీష్ కుమార్‌లు విచ్చేసారు. వారికి ఆలయమర్యాదలతో దక్షిణ గోపురం వద్ద ఎఇఓ సతీష్‌కుమార్ సారధ్యంలో వేదపండితులు స్వాగతం పలికారు. స్వామి అమ్మ వార్ల అంతరాలయ దర్శనం తరువాత గురుదక్షిణామూర్తి ఆలయం వద్ద వేదపండితులతో ప్రత్యేకాశీర్వచనాలు ఏర్పాటు చేసారు. వారికి ఏర్పాట్లను ఆలయ ఇన్సెపెక్టర్ హరియాదవ్, పిఆర్ఓ నాగభూషణం నాయక్, పెరుమాళ్‌రెడ్డి పర్యవేక్షించారు.

## భక్తులకు అన్నదానం

నగరి, సెప్టెంబరు 4 ప్రభాతవార్త: మండలంలోని బుగ్గ అగ్రహారం టీటీడీ అనుబంధంలో ఉన్న అన్నపూర్ణ సమేత కాశీవిశ్వేశ్వర ఆలయంలో సోమవారం దాతలు భక్తులకు అన్నదానం చేశారు. ఆలయానికి దర్శనానికి విచ్చేసిన భక్తులకు తిరుపతి తుమ్మలగుంటకు చెందిన పత్రేష అనే దాత ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు అన్నదానం చేశారు. ఆలయంలో అన్నదానం చేయదలచిన వారు ముందు రోజు పేరు నమోదు చేసుకోవాలని టెంపుల్ ఇన్‌స్పెక్టర్ గుణశేఖర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ సిబ్బంది, అర్చకులు పాల్గొన్నారు.

## మంత్రి చొరవతో పరిష్కారమైన దారి సమస్య

నగరి, సెప్టెంబరు 4 ప్రభాతవార్త: ప్రజల పక్షాన నిలబడి పాలించే నాయకు లుంటే సమస్యలకు ఎప్పటికప్పుడు పరిష్కార మార్గం ఉంటుందని ప్రస్తుత పాలనలో నిరూపణ అవుతోంది. ఇటీవల కురిసిన వర్షాలకు మండలంలోని బీరకుప్పం గ్రామానికి వెళ్లేందుకు ఉన్న ప్రధాన మార్గం కొట్టుకుపోవడంతో రాకపోకలు ఇబ్బందికరంగా మారింది. సమస్య తెలిసిన వెంటనే స్పందించిన మంత్రి సంబంధిత అధికారులకు ఆదేశాలివ్వడంతో సోమవారం ఒక్క రోజులోనే యుద్ధ ప్రాతిపదికన మార్గం సుగమమైంది. గ్రామానికి వెను వెంటనే దారి ఏర్పాటు చేసిచ్చిన మంత్రికి గ్రామస్థులు కృతజ్ఞతలు తెలిపారు.

## ఇండియా పోస్ట్‌తో అమెజాన్ ఒప్పందం



తిరుపతి ప్రెస్‌క్లబ్, సెప్టెంబర్ 4 ప్రభాతవార్త: ప్రముఖ అమెజాన్ కంపెనీ ఎగుమతిదారుల కోసం సరిహద్దు లాజిస్టిక్స్‌ను సరళీకృతం చేయడానికి ఇండియా పోస్ట్‌తో అవగాహన ఒప్పందం కుదుర్చుకుందని ఆ సంస్థ సిఈఓ మేడిజన్స్ తెలిపారు. సోమవారం ఓ ప్రైవేట్ హోటల్లో జరిగిన కార్యక్రమంలో భాగంగా ఆయన మాట్లాడుతూ లాజిస్టిక్స్, సప్లై చైన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌కు వెన్ను ముక అయిన ఇండియా పోస్ట్, ఇండియన్ రైల్వేస్‌తో దీర్ఘకాల అనుబంధాన్ని పెపొందించుకుంటూ, లక్షలాది మైక్రో, స్మాల్, మీడియం ఎగుమతుల అవకాశాన్ని విస్తరించే ఇంటిగ్రేటెడ్ క్రాస్ బోర్డర్ లాజిస్టిక్స్ సొల్యూషన్స్ కోసం, ఇండియా పోస్ట్‌తో అవగాహన ఒప్పందం కుదుర్చుకోవడం జరిగిందన్నారు. అదనంగా అమెజాన్ తన విక్రేతల కోసం భారతదేశమంతటా వినియోగదారులకు వేగవంతంగా డెలివరీ చేయడానికి ఇండియన్ రైల్వేస్ డెడికేటెడ్ ఫ్రైట్ కారిడార్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(డిఫ్సీ)తో నిమగ్నమయిందన్నారు. ఇది భారతదేశంలోని సరుకు రవాణా రైల్వే మార్గాల ద్వారా కస్టమర్ ప్యాకేజీలను రవాణా చేయడానికి ప్రభావితం చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో అమిత్ అగర్వాల్, మనీష్ తివారి, సిన్హా, వినీత్ పాండే తదితరులు పాల్గొన్నారు.

## నిత్యాన్న ప్రసాదానికి నెల్లూరు వాసుల విరాళం



శ్రీకాళహస్తి, సెప్టెంబర్ 4 ప్రభాతవార్త :శ్రీకాళహస్తీశ్వరాలయంలో నిర్వహిస్తున్న నిత్యాన్నప్రసాద పథకానికి సోమవారం నెల్లూరుకు చెందిన డా.జి. వెంకటేశ్వరరావు కుటుంబసభ్యులు స్వామి అమ్మ వార్లను దర్శించు కున్నారు. తరువాత ధర్మకర్తల మండలి చైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులును కలసి ఆలయంలో నిర్వహిస్తున్న వివిధ సేవలు, పథకాల గురించి వాకబు చేసారు. చైర్మెన్ లోబావిలో చేపట్టే కాటేజీల పథకాన్ని వివరించారు. అలాగే ఆలయంలో నిర్వహించే నిత్యాన్న పథకం గురించి వివరించారు. డాక్టర్ జి.వెంకటేశ్వరరావు నిత్యాన్న ప్రసాదానికి రూ.లక్ష విరాళాన్ని అందించారు. ప్రత్యేకాశీర్వచనాలు, స్వామి అమ్మవార్ల శేష వస్త్రాలను అందించి సత్కరించారు.

## జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులు వీరే

శ్రీకాళహస్తి, సెప్టెంబర్ 4 ప్రభాతవార్త: ఆంగ్లభాష అంటేనే పలువురు విద్యార్థులు వెనుకంజవేస్తారు. అయితే మారుతున్న విద్యాబోధనలకు అనుగుణంగా ప్రభుత్వం విద్యావ్యవస్థపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటుండడంతో అన్ని పాఠశాలలు ఆంగ్లభాషలోకి మార్చింది. అంతేకాకుండా నాడు నేడులో ప్రభుత్వ పాఠశాలలు కార్పొరేట్, ప్రైవేటు పాఠశాలల కంటే దీటుగా మారాయి. ఈనేపథ్యంలో ప్రతి ఏడాది ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు ప్రధానం చేస్తోంది. ఈనేపథ్యంలో పట్టణంలోని బాబుఅగ్రహారం మున్సిపల్ ఉన్నత పాఠశాలలో ఆంగ్లభాషా ఉపాధ్యాయురాలిగా విధులు నిర్వహిస్తున్న చింతలపూడి పార్వతీ ఈఏడాది ఉత్తమ ఉపాధ్యాయ రాలిగా అవార్డు అందుకోనున్నారు. కాగా భాస్కరపేటలోని గ్రేడ్-2 హెచ్‌ఎం గా పనిచేస్తున్న ఎ.శ్రీదేవి, చెర్లోపల్లి మండలపరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్న ఎ.దుర్గాదేవి, ముచ్చివోలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో భౌతికశాస్త్ర ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్న ఎన.సుబ్రమణ్యశర్మలు నేడు జరిగే అవార్డుల ప్రధానోత్సవంలో ఉత్తమ ఉపాధ్యాయులుగా అవార్డులు అందుకోనున్నారు.

## మహాకుంభాభిషేకానికి మల్లేశ్వరాలయం ముస్తాబు



గుడుపల్లె, సెప్టెంబర్ 4ప్రభాతవార్త : మండలంలోని మల్లప్ప కొండపై వెలసిన శ్రీ మల్లేశ్వరస్వామి ఆలయం ముస్తాబవుతోంది. ఈనెల 11-13 తేదీల్లో ఆలయ కుంబాభిషేకాన్ని పెద్ద ఎత్తున జరపనున్నారు. ఈనేపథ్యంలో ఆలయం వద్ద కార్యక్రమాల నిర వ్వహణకు పందిళ్లు ఏర్పాటు, భూమి చదును పనులు చేపడుతున్నారు. ఈ కుంబాభిషేకానికి రాష్ట్ర మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి హాజరవుతారని సమాచారం.

## కమనీయం లక్ష్మీనారాయణుని కళ్యాణం

గంగాధర నెల్లూరు, 4 సెప్టెంబరు ప్రభాతవార్త: మండల పరిధిలోని వేపంజేరిలో వెలసి యున్న శ్రీ అష్టలక్ష్మి సమేత శ్రీ లక్ష్మీ నారాయణ స్వామి ఆలయంలో సోమవారం శ్రీదేవి భూదేవి సమేత లక్ష్మీ నారాయణస్వామి వారి కళ్యాణాన్ని అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం మూల విరాట్‌కు ప్రత్యేక అభిషేకాలు నిర్వహించి ప్రత్యేక పుష్పాలతో అలంకరించి నైవేద్యాలు సమర్పించారు అనంతరం స్వామి అమ్మ వార్లను ఆలయ కళ్యాణ మండపానికి చీర సారెలతో మంగళ వాయిద్యాల నడుమ ఊరేగింపుగా తీసుకెళ్లారు. ఆలయ అర్చకులు స్వామి వారి కళ్యాణాన్ని ఆగమ శాస్త్ర ప్రకారం వేద మంత్రాలు నడుమ కనువిందుగా నిర్వహించారు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమలకు పెనుమూరుకు చెందిన పవిత్ర సాయిప్రకాష్ రెడ్డిలు ఉబయ దారులుగా వ్యవహరించారు.

## పుంగనూరు వాసులకు ఉత్తమ సేవా,ఉపాధ్యాయ అవార్డులు



పుంగనూరు, సెప్టెంబరు 4 ప్రభాతవార్త: ఉపాధ్యాయదినోత్సవం పురస్కరించుకుని దైవస్‌షైన్ అధ్వర్యంలో భాకరాపేటలో జరిగిన అవార్డుల ప్రదానంలో పుంగనూరు ప్రాంతానికి చెందిన పలువురు కవులు, ఉపాధ్యాయులకు భారీఎత్తున సత్కారం లభించింది. చౌడేపల్లి హరిజనవాడకు చెందిన పాఠశాల ఉపాధ్యాయురాలు గాయత్రీదేవి, 29 చింతమాకులపల్లి ఉపాధ్యాయురాలు వహీదారహమాన్, డిగ్రీకళాశాల లెక్చరర్ స్రవంతి, ఉత్తమకవులుగా సాల్వరాజు సతీష్‌కుమార్, హసీనాబేగంలు ఈసత్కారాలు అందుకున్నారు. ఉషోదయ ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు డాక్టర్ ధనాశి ఉషారాణి సమన్వయకర్తగా వ్యవహరించగా, దైవన్‌షైన్ పాఠశాల కరస్పాండెంట్ దైవకటాక్షం, సాయి స్కూల్ కరస్పాండెంట్ జనార్ధన్, సర్పంచ్ భూపాల్, రచయిత నారాయణస్వామిల అధ్వర్యంలో కార్యక్రమాలు జరిగాయి. సన్మానాలు పొందిన వారిని పుంగనూరు ప్రజలు అభినందించారు.

## టిటిడిలో ఖాళీ పోస్టులను భర్తీ చేయాలి

**-తహాశీల్దార్ కార్యాలయాల వద్ద అందోళన చేపట్టిన సిపిఎం**



తిరుపతిరూరల్, సెప్టెంబర్4 ప్రభాతవార్త: తిరుమల తిరుపతి దేవస్థానంలో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని సిపిఎం నాయకులు డిమాండ్ చేసారు. దేశ వ్యాప్తంగా జరుగుతున్న అందోళనలో భాగంగా సోమవారం తిరుపతి అర్బన్, రూరల్ తహాశీల్దార్ కార్యాలయాలు వద్ద అందోళనలు చేపట్టారు. అధిక ధరలను తగ్గించాలని, పెంచిన విద్యుత్ చార్జీలను రద్దు చేయాలని కోరుతూ సిపిఎం ఆధ్వర్యంలో డిమాండ్ చేసారు. ఈ కార్యక్రమంలో జయచంద్ర, డాక్టర్ సాయిలక్ష్మీ, సుమన్ మాట్లాడుతూ టిటిడిలో ఖాళీగా వున్న 9500 పోస్టులు భర్తీ చేయాలని డిమాండ్ చేసారు. దేశంలో నిరుద్యోగ సమస్య రోజురోజుకు పెరుగుతుందని, గత ప్రభుత్వంలో 4.5 శాతం ఉన్న నిరుద్యోగ సమస్య నేడు 8.5 శాతానికి పెరిగిందన్నారు. లక్షలాదిమంది నిరుద్యోగులు తమ చదువులను ముగించుకుని ఉద్యోగ వేటలో ఉంటే ప్రభుత్వం ఏ మాత్రం పట్టించుకోకపోవడం దారుణం అన్నారు. డిగ్రీలు, పీజీలు, బిఈడిలు, పిహెచ్‌డిలు పట్టాలు పొంది, ఉద్యోగాలు దొరక రోడ్డుపైన అన్నమో రామచంద్రా అని అడుక్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేసారు. దేశ వ్యాప్తంగా 25 లక్షల ప్రభుత్వ పరిశ్రమలలో ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయని, వాటికి నోటిఫికేషన్ ఇవ్వలేదన్నారు. దేశ ప్రధాని మోడీ రెండు కోట్ల ఉద్యోగాలు భర్తీ చేస్తానని చెప్పి, మాట తప్పారన్నారు. దేశానికి నల్లధనాన్ని తెచ్చి ప్రతి కుటుంబానికి రూ.15లక్షలు రుపాయాలు ఇస్తానని హామీని మరిచారని, 8లక్షల కోట్ల రుపాయాలు కార్పొరేట్ కంపెనీలకు లాభం చేకూర్చే విధంగా అప్పులు చేయడం జరిగిందన్నారు. రాష్ట్రంలో జగన్మోహన్‌రెడ్డి సర్కార్ ఉద్యోగలు భర్తీ చేస్తామని అసెంబ్లీ సాక్షిగా హామీ ఇచ్చి, విస్మరించారని వాపోయారు. జాబ్ లేస్ క్యాలెండర్‌ను విడుదల చేసిన ఘనత సి.యం. జగన్‌కే దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు నీలకంఠం, శేఖర్, నరేంద్ర, వేణుగోపాల్, పార్ధసారధి, మల్లిఖార్జున, శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

## కొల్హాపురి మహాలక్ష్మివైభవంపై...గరికపాటి ప్రవచనం



తిరుపతి, సెప్టెంబర్ 4ప్రభాతవార్త: పవిత్రమైన శ్రావణమాసం సందర్భంగా సోమవారం సాయంత్రం అన్నమాచార్యకళామందిరంలో ప్రవచనకర్త గరికపాటి రమేష్ కొల్హాపురి మహాలక్ష్మివైభవాన్ని చక్కగా తెలియజేశారు. అమ్మవారి వైభవం, భక్తితో అమ్మవారిని ప్రసన్నంచేసుకోవడం విపులంగా వివరించారు. ఈ సందర్భంగా రాయలసీమ రంగస్థలి కళాసంస్థ చైర్మన్ గుండాల గోపీనాథరెడ్డి , సుబ్రమణ్యంరెడ్డి, వెంకట్రామయ్య, కెఎన్ రాజ, అన్నమాచార్యప్రాజెక్టు సిబ్బంది కోకిల, రమేష్ పాల్గొని గరికపాటిని ఆత్మీయంగా సన్మానించారు.

## టిటిడి ఉద్యోగుల సంక్షేమానికి పెద్దపీట

**-ఉద్యోగుల బ్యాంకు చైర్మన్‌కు అభినందనలు**



తిరుపతి, సెప్టెంబర్ 4ప్రభాతవార్త: టిటిడి ఉద్యోగుల సంక్షేమం కోసం నిర్వహిస్తున్న ఉద్యోగుల బ్యాంకు పనితీరు, కార్యకలాపాలు అభినందనీయమని జిల్లా కోఆపరేటివ్ అధికారి ఎస్. శ్రీనివాసులు రెడ్డి తెలిపారు. సోమవారం ఉదయం టిటిడి పరిపాలన భవనంలో ఉన్న ఉద్యోగుల బ్యాంకును ఆయన సందర్శించారు. బ్యాంకు లావాదేవీలు, కార్యకలాపాలు, నిర్వహణపై బ్యాంకు చైర్మన్ చీర్లకిరణ్‌ను, సభ్యులను ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా జిల్లా కోఆపరేటివ్ అధికారి ఎస్. శ్రీనివాసులురెడ్డిని చీర్లకిరణ్ దుశ్శాలువతో సన్మానించారు.

## 1వ తేదీ కోడికూయకవ ముందే పెన్షన్‌లు పంపిణీ..ఎంఎల్‌ప



.శ్రీకాళహస్తిరూరల్, సెప్టెంబర్ 4 ప్రభాతవార్త : కులమతాలకు, పార్టీలకు అతీతంగా ప్రతి ఒక్కరికి పెన్షన్ అందజేయడమే ముఖ్యమంత్రి జగనన్న లక్ష్యం అని శాసనసభ్యుడు బియ్యపు మధు సూధన్‌రెడ్డి అన్నారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిధులుగా శాసనసభ్యుడు బియ్యపు మధుసూధన్‌రెడ్డి, ఎంఎల్‌సి డాక్టర్ సిపాయి సుబ్రమణ్యంలు విచ్చేశారు. వీరు మాట్లాడుతూ నాడు జన్మభూమి కమిటీల ద్వారా ఎన్నో అవకతవకలకు పాల్పడ్డారని కానీ నేడు వాలంటీర్ల ద్వారా అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రతి నెల ఒకటోతేదీన కోడికూయక ముందే వారి ఇంటిముందుకు పెన్షన్ అందిస్తున్నామన్నారు. గత ప్రభుత్వంలో పెన్షన్ తీసుకోవాలంటే ఎవరో ఒకరు మరణిస్తే కానీ ఇచ్చేవారు కాదని కానీ నేడు వాటిన్నింటికీ స్వస్తి పలుకుతూ సిఎం జగన్‌మోహన్‌రెడ్డి దేశచరిత్రలో ఎక్కడా లేని విధంగా వాలంటీరు వ్యవస్థను తీసుకువచ్చి అవ్వతాతల మొహంలో నవ్వులు చూడడం కోసం నేరుగా వారి ఇంటికి పెన్షన్ అందిస్తున్నారు. ప్రజా సంకల్ప యాత్రలో ఇచ్చిన మాట ప్రకారం నాడు రూ.1000లు ఉన్న పెన్షన్ నేడు రూ.2,750గా అందజేస్తున్న గొప్ప మనసున్న మారాజు సిఎం అని కొనియాడారు. అనంతరం నూతనంగా మంజూరైన పెన్షన్‌లను లబ్దిదారులకు పంపిణీచేశారు. కార్యక్రమంలో ఎంపిపి సంపూర్ణమ్మ, జడ్పీటిసి వెంకటసుబ్బారెడ్డి, మండల నాయకులు బర్రెహేమభూషణ్‌రెడ్డి, వైస్ ఎంపిపి భానుమూర్తి యాదవ్, వడ్లతాంగల్ బాలాజీప్రసాద్‌రెడ్డి, మండల యువత కన్వీనర్ సురేంద్రయాదవ్, ఎంపిటిసి గోవర్ధన్‌రెడ్డి, మండల అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## కాలేయ మార్పిడికి ముఖ్యమంత్రి సహాయనిధి

నగరి, సెప్టెంబరు 4 ప్రభాతవార్త: మున్సిపల్ పరిధి 5వ వార్డుకు చెందిన అబ్దుల్ బాషా కుమారుడు హనీఫా(45)కు కాలేయ మార్పిడికి ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి రూ.10 లక్షల ఎల్‌వోసీని మంత్రి రోజా సోమవారం అందజేశారు. 5వ వార్డుకు చెందిన హనీఫాకు ఇటీవల కాలేయ సంబంధిత వ్యాధి సోకడంతో తీవ్ర అనారోగ్యానికి గురయ్యాడు. తన కుమారుని పరిస్థితిని అబ్దుల్‌బాషా మంత్రి రోజాకు విన్నవించుకుని ఆర్థిక సాయం అందించాలని కోరాడు. వెంటనే స్పందించిన మంత్రి ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా కాలేయ మార్పిడి చికిత్స కోసం రూ.10 లక్షల ఎల్‌వోసీని మంజూరు చేయించారు. సోమవారం తన నివాస కార్యాలయంలో బాధిత కుటుంబానికి అందజేశారు. తమకు చేసిన మేలు మరువలేనిదంటూ హనీఫా కుటుంబ సభ్యులు మంత్రికి తజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్లు దయానిధి పాల్గొన్నారు.

## మెకానిక్ షాప్‌లో మంటలు -దగ్ధమైన ద్విచక్రవాహనాలు

రేణిగుంట, సెప్టెంబరు 4 ప్రభాతవార్త: రేణిగుంట పట్టణం శ్రీకాళహస్తి రోడ్డు ఖాదర్‌బాషా సర్కిల్ వద్ద ఓ మెకానిక్ షాపులో సోమవారం అగ్ని ప్రమాదంజరిగింది. ఈ ప్రమాదంలో కొన్ని ద్విచక్రవాహనాలు పూర్తిగా అగ్నికి ఆహుతయ్యాయి. ఎలాంటి ప్రాణ నష్టం జరగకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు. వివరాలు ఇలా.... షాపులో పని చేస్తున్న మెకానిక్‌లు భోజనం చేయడానికి వెళ్లారు. ఉన్నట్టుండి షాపులో మంటలు చెలరేగి ఊవెత్తున వ్యాపించడంతో పెద్ద ఎత్తున పొగలు కమ్ముకున్నాయి. ప్రమాదం ఎలా జరిగిందో నిర్ధారించలేకున్నారు. స్థానికులు వెంటనే అప్రమత్తమై మంటలను అదుపు చేశారు. ఇప్పటికే కొన్ని ద్విచక్రవాహనాలు మంటల్లో పూర్తిగా కాలిపోయాయి. ఎన్ని వాహనాలు కాలిపోయాయన్నది తెలియదు. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్ల ప్రమాదం జరిగినట్లు భావిస్తున్నారు. ఆస్తి నష్టం ఎంత జరిగిందో తెలియాల్సి ఉంది.

## స్పందనలో వచ్చే ఫిర్యాదులు... సకాలంలో పరిష్కరించాలి

**మేయర్ డాక్టర్ శిరీష, కమిషనర్ హరిత**

తిరుపతి కార్పొరేషన్, సెప్టెంబర్ 4 ప్రభాతవార్త : స్పందనలో వచ్చే ఫిర్యాదులు సకాలంలో పరిష్కరించాలని తిరుపతి నగర పాలక సంస్థ మేయర్ డా. శిరీష, కమిషనర్ హరిత అధికారులను ఆదేశించారు. సోమవారం మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో సోమవారం డయల్ యువర్ కమిషనర్, అర్జీలు స్వీకరించే స్పందన కార్యక్రమంలో మేయర్ డాక్టర్ శిరీష, కమిషనర్ హరిత అర్జీలను స్వీకరించగా, డిప్యూటీ మేయర్ ముద్రనారాయణ, విభాగాల అధిపతులు, సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా కమిషనర్ హరిత మాట్లాడుతూ తిరుపతి నగరంలో నూతన భవనాలు నిర్మించేటప్పుడు, భవన నిర్మాణాలు తొలగించేటప్పుడు సరైన పద్ధతులు ఆ యజమానులు పాటించేలా అధికారుల పర్యవేక్షణ వుండాలని అన్నారు. సోమవారం డయల్ యువర్ కమిషనర్‌కు 14, స్పందనకు 13 పిర్యాదులు అందాయన్నారు. మొత్తం ఫిర్యాదులు అన్నింటిపై సంబంధిత అధికారులు తగు చర్యలు తీసుకోవాలని తిరుపతి నగర పాలక సంస్థ కమిషనర్ హరిత ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ చంద్రమౌళీశ్వర్ రెడ్డి, సూపరింటెండెంట్ ఇంజనీర్ మోహన్, మున్సిపల్ ఇంజనీర్లు చంద్రశేఖర్, వెంకట్రామిరెడ్డి, రెవెన్యూ అధికారులు కెఎల్ వర్మ, సేతు మాధవ్, సెక్రటరీ రాధిక, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ అన్వేష్ రెడ్డి, సిటీ ప్లానింగ్ అధికారులు శ్రీనివాసులు రెడ్డి, బాలసుబ్రమణ్యం, డిఈలు విజయకుమార్ రెడ్డి, రవీంద్ర రెడ్డి, సంజీవ్ కుమార్, మహేష్, గోమతి, దేవిక, నరేంద్ర, వెటర్నరీ ఆఫీసర్ డాక్టర్ నాగేంద్ర రెడ్డి, మేనేజర్ చిట్టిబాబు, సర్వేయర్ దేవానంద్, సూపరింటెండెంట్లు, ఆర్ఐలు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## ఏదయా..మీదయా..మామీద లేదు.. -గురువులకు పూజోత్సవ కానుక ..నో..శాలరీ

**గురుపూజోత్సవం ప్రత్యేకం**

**ప్రభాతవార్త ప్రతినిధి, పుంగనూరు**

బతకడానికి ఏమికావాలో నేర్పి...,వేలాది మంది జీవితాలను ప్రభావితం చేసి, ప్రపంచస్థాయిలో వారిని అగ్రపీఠం మీద కూర్చోబెట్టేవారే గురువులని ప్రపంచం గురువులను వేనోళ్ళా కీర్తిస్తుంటే..ఇపుడు రాష్ట్రంలో గురువుల పరిస్థితి దయనీయంగా మారుతోంది. తమ పిల్లలకు ప్రభుత్వ బడులలో విద్యాబుద్ధులు నేర్పిస్తారని పంపితే, బడులన్నీ ఇటుకలు, సిమెంటు, ఇసుక, గుంతలు, రాళ్ళు రప్పలతో గందరగోళంగా మారిందని తల్లితండ్రుల వాపోతున్నారు. ఇప్పటివరకు జనాభాలెక్కల నుంచి గ్రామాల్లో జంతువులు, పక్షుల లెక్కల వరకు అన్నింటిని చేసిన అనుభవమున్న ఉపాధ్యాయులను బిల్డింగ్ కాంట్రాక్టర్‌గా మార్చేసి ప్రభుత్వం నిర్మాణరంగంలో మాష్టార్లకు నైపుణ్యత కల్పిస్తోందని ప్రజలు వేళాకోలం చేస్తుంటే పాఠాలు చెప్పాల్సిన ఉపాధ్యాయులు చేసేదేమీ లేక బిక్కపోతున్నారు. టీచర్లందరికీ వారివారి మొబైల్ ఫోన్‌లో అన్ని రకాల యాప్‌లు వేసి, పాఠశాల ప్రణాళికలు, బోధనపద్ధతి, రాగిజావ కాచేపద్దతి, మొదలు మరుగుదొడ్ల వద్దనుంచి కోడిగుడ్లవరకు అన్ని లెక్కలు సరిగా చూడాలని, ఫోటోలు పెట్టాలని హుకుం జారీచేసిన శాఖలు ఇపుడు ఫోన్లు వాడాకూడదని ఉదయం నుంచి సాయంత్రం వరకు హెడ్‌మాస్టర్ వద్ద ఫోన్ ఉంచాలని కూడా ఆదేశాలు జారీచేసింది. ఇదంతా చూస్తుంటే విద్యాశాఖ, పాఠశాలలు, ఉపాధ్యాయులు క్రమంగా రంగులు మార్చేసుకుని, కొత్త రంగంలోకి పరకాయప్రవేశం చేయడానికి చేస్తున్న కసరత్తులాగా ఉందని విమర్శకులు స్పష్టంచేసేస్తున్నారు. ఇదంతా ఇపుడెందుకంటే,..ఈరోజు గురుపూజోత్సవం. ప్రపంచవేదిక మీద కూర్చుని భవిష్యత్తు తరాలకు వారధులను, సారధులను, సమరసతా మూర్తులను అందించేందుకు మహాయజ్ఞానికి పాల్పడే నేడు ఉపాధ్యాయులని పిలవబడే గురువులను స్మరించుకునే రోజు ఈరోజు. ప్రపంచమేధావి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణపండితుని జన్మదినం రోజున గురువులను స్మరించుకోవాలని మేధావులు నిర్దేశించారు. ప్రతిఏటా దేశంమొత్తం సెప్టెంబరు 5న గురువులకు సాగిల పడుతుంది..గురువుల పాదాలకు మొక్కి..మీవల్లనే..ఇంత ఎత్తు ఎదిగానంటూ ప్రపంచం పరవశించిపోతుంది. ఇటువంటి గురుపూజోత్సవం రోజు రాష్ట్ర ప్రభుత్వం వారికి ఇస్తున్న కానుక..ఏమంటే..ఈరోజు వరకు కూడా జీతాలు మంజూరు లేదు. దీనికి తోడు వారు ఏండ్లతరబడి దాచుకున్న పిల్లల పెళ్లిల్లు, చదువులకని పిఎఫ్‌లో దాచుకున్న డబ్బుల కోసం ఏప్రిల్‌నుంచి ఎదురు చూస్తుంటే, నేటికీ ఒక్క రూపాయి కూడా విదల్చలేదని ఉపాధ్యాయలోకం వాపోతోంది... మాడబ్బులు, మాజీతాలు ఇవ్వడానికి ఎందుకు మీనమేషాలు లెక్కిస్తున్నారని ప్రశ్నిస్తుంటే,.,ఉంటే కదా ఇచ్చేదానికి ఉందేదంతా ఊడ్చేశారు.. ఇక బాండ్లు వేలమైతేనే గురువా మీకు జీతాలంటూ ఆకతాయిలు ఆటపట్టిస్తున్నారు... సారీ గురో..జీతాలు ఇపుడే రావు..చాలా రోజులు పడుతుంది అంటున్నారు కూడా....హ్యాపీ టీచర్స్‌డే సారూ...